సంపుటి : 9
సంచిక : 305
మంగళవారం
28 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

## ఆ నియామకాలు చెల్లవ్

### విజయ్ సర్కార్‌కు హైకోర్టులో షాక్



చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ : విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కరూర్ తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఇచ్చిన ఉద్యోగాలు చెల్లవని ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. రాజ్యాంగ పరిమితులకు లోబడి ప్రభుత్వం వ్యవహరించాలని సూచించింది. ప్రభుత్వ చర్యలపై నియంత్రణ లేకపోతే.. అరాచకం, అశాంతి రాజ్యమేలుతాయని పేర్కొంది. "ప్రభుత్వ ఉద్యోగం అనేది ఉచితంగా పంచిపెట్టేది కాదు. దాన్ని మిగతా .. 2లో..



### ఆగస్టు 1న విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని

# వైభవంగా నిర్వహించాలి

- ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు
- ప్రధాని మోదీకి థింసా, కూచిపూడి నృత్యాలతో ఘన స్వాగతం
- ఉత్తరాంధ్రకు గర్వకారణంగా అల్లూరి అంతర్జాతీయ విమానాశ్రయం
- ఏఎస్ఆర్ ఎయిర్ పోర్టుపై ప్రతీ ఇంటికీ చేరేలా విస్తృత ప్రచారం
- ప్రారంభోత్సవ ఏర్పాట్లపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రధాని మోదీ చేతుల మీదుగా జరిగే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆగస్టు 1న ప్రారంభం అవుతున్న అల్లూరి సీతారామరాజు ఇంటర్నేష నల్ ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్ర ప్రగతిలో కీలక మైలురాయి అవుతుందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో నూతన శకం ప్రారంభం అవుతుందని సీఎం స్పష్టం చేశారు. ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం ఈ ప్రాంతంలో ప్రయాణ సౌకర్యాలతో పాటు ఉపాధి, పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతం ఇస్తుందని స్పష్టం చేశారు. ఉత్తరాంధ్రతో పాటు తెలుగు జాతికి గర్వకారణంగా మారనున్న విమానాశ్రయం ప్రారంభించేందుకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీకి గిరిజన సంప్రదాయ నృత్యం థింసా, కూచిపూడి నృత్యంతో స్వాగతం పలకాలని అధికారులకు సీఎం సూచించారు. గిన్నిస్ రికార్డు సృష్టించేలా ఎక్కువ మందితో థింసా నృత్య ప్రదర్శన ఉండాలని స్పష్టం చేశారు. అలాగే అరకు కాఫీ సహా స్థానిక పర్యాటకానికి బ్రాండింగ్ జరుగుతుందన్నారు.

**ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు విస్తృత ప్రచారం**

ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు మిగతా .. 2లో..

### ఎల్‌నినో ప్రభావంపై రైతులకు

## అవగాహన కల్పించాలి

### సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : ఎల్‌నినో ప్రభావం కారణంగా ఏర్పడిన వాతావరణ మార్పులపై రైతుల్లో అవగాహన కల్పించాలని ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి సంబంధిత శాఖలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది అంతటా ఎల్‌నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ఏ ప్రాంతాల్లో మిగతా .. 2లో..

### 'అనంతపురంలో విమానాశ్రయం

## ఏర్పాటుకు సహకరించండి'

### ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : దేశంలో అధిక మొత్తంలో ఉద్యాన పంటలను సాగు చేసే అనంతపురం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన దిల్లీలో పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి పలు అంశాలు చర్చించారు. అనంతపురంలో ఎయిర్‌పోర్టు మిగతా .. 2లో..

### పార్టీని ఇబ్బంది పెట్టే

## వ్యాఖ్యలు చేయలేదు

### తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమా



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : వైకాపా నేత అంబటి రాంబాబుతో వేదిక పంచుకోవడం, ఆయనతో సన్నిహితంగా మెలగడంపై తెదేపా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావును ఆ పార్టీ అధిష్ఠానం వివరణ కోరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బొండా ఉమా స్పందించారు. "పార్టీని ఇబ్బంది పెట్టే వ్యాఖ్యలు చేయలేదు. నేనేంటో మిగతా .. 2లో..

### విజయవాడలోనే సీఐ నాగరాజు

## విచారణకు సుప్రీంకోర్టు అనుమతి



దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంక పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజును విజయవాడలోనే పోలీస్ కస్టడీలో విచారించడానికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితుడిని రాజమండ్రి కేంద్ర కారాగారంలోనే కస్టడీలోకి తీసుకొని విచారించాలంటూ ట్రయల్ కోర్టు, ఏపీ హైకోర్టులు మిగతా .. 2లో..

### పిఠాపురం నియోజక వర్గం అభివృద్ధి పనుల

# పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్ష



- క్షేత్రస్థాయి పరిశీలనకు కార్యాలయ సిబ్బంది
- కొత్త రోడ్లు, నాగులాపల్లి తాగునీటి సరఫరా పథకం అభివృద్ధిపై ఆరా
- అభివృద్ధి పనుల నాణ్యతను పరిశీలించాలని స్పష్టీకరణ
- పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలు సూచనలు
- నియోజకవర్గంలో 100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు
- పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై వివరణ కోరిన ఉప ముఖ్యమంత్రివర్యులు

పిఠాపురం, విశ్వం వాయిస్ న్యూస్ : పిఠాపురం నియోజకవర్గంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన, ప్రజా సేవల అమలు తీరుపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కార్యాలయ సిబ్బందిని నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి పరిశీలనకు పంపారు. అంశాలవారీగా వారు సమర్పించిన నివేదికలను పరిశీలించారు. నియోజకవర్గవ్యాప్తంగా నూతనంగా నిర్మించిన రోడ్ల నాణ్యత, నాగులాపల్లి సమగ్ర రక్షిత మిగతా .. 2లో..

### మంత్రి నారా లోకేష్‌ను కలిసిన

# 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన విద్యార్థిని జెస్సీ

### రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని అభినందించిన మంత్రి
### అన్ని విధాల మద్దతుగా నిలుస్తామని భరోసా



ఉండవల్లి, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ గ్లోబల్ లూనార్ క్యూబ్ శాట్ 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన కందుల జెస్సీ, మిషన్ శక్తిశాట్ డైరెక్టర్ శ్రీమతి కేశన్ తో కలిసి ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ధవళేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ.. 'మిషన్ శక్తిశాట్' ఎంపికై రికార్డ్ సృష్టించారు. భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో చోటు దక్కించుకుని ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా నిలిచారు. ఈ సందర్భంగా జెస్సీ మాట్లాడుతూ.. పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా చేసిన ప్రయోగాలు తనలో ఆసక్తి రేకెత్తించాయని చెప్పారు. ఏడో తరగతి నుంచే తనకు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి కలిగిందని వివరించారు. మిషన్ శక్తిశాట్ లో మొత్తం 550 సెషన్లు, 21 మాడ్యూల్స్ నేర్చుకున్నట్లు తెలిపారు. భారత్ నుంచి ఎంపికైన 20 మందిలో ఒకరిగా నిలవడం ఆనందంగా ఉందని, భవిష్యత్ లో ఏరోనాటికల్ ఇంజనీర్ కావాలనేది తన లక్ష్యమని తెలిపారు. మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఏపీలో అభివృద్ధి చేస్తున్న 22 క్లస్టర్లలో మిగతా .. 2లో..

### ఆ అభిమానాన్ని జీవితంలో

## మర్చిపోలేను

### నారా భువనేశ్వరి



శాంతిపురం, విశ్వం వాయిస్ న్యూస్ : 'నిజం గెలవాలి' యాత్ర సమయంలో కుప్పం ప్రజలు తనపై చూపించిన అభిమానాన్ని జీవితంలో మర్చిపోలేనని సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం ఆమె రామకుప్పం మండలం నారాయణపురం, ననియాల తండాల్లో పర్యటించి, అక్కడి మహిళలతో మిగతా .. 2లో..

### శివాని మృతి నన్ను

## తీవ్ర విషాదంలోకి నెట్టేసింది

### సీఎం చంద్రబాబు

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని ఆత్మహత్య చేసుకోవడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. మెగా పీటీఎంలో ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని మృతి తనను కలచివేస్తోందన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. "పదో తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో నిర్వహించిన మెగా పీటీఎంలో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన విద్యార్థిని బలవన్మరణం ఆవేదన మిగతా .. 2లో..

### ప్రజా పంపిణీ ద్వారా ప్రజలకు

## స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

- రాష్ట్రంలో అమలుకు సన్నహాలు
- 1000 మీ మార్టుల ఏర్పాటుకు కేంద్రం సహకారం
- రేషన్ బియ్యంలో 10 శాతం నూకల బియ్యం ఉండేలా చర్యలు
- ఢిల్లీ పర్యటనలో పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులను కలిసిన రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్



న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని, దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖామాత్యులు ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ (ఎన్సీసీఎఫ్) ఎండీ శ్రీమతి అనీస్ జోసఫ్ గారిని కలిసి రాష్ట్రంలో 1000 "మీమార్టు" ల ఏర్పాటుపై తగిన సహకారం కోరుతూ ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా గారిని కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను మిగతా .. 2లో..

### వాళ్లకు అడ్డుపడటమే

## నేను చేసిన తప్పే

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : హైడ్రా కమిషనర్‌గా ఈ రెండేళ్ల కాలంలో చెరువులు, పార్కులను రక్షించానని.. రూ. 1.5 లక్షల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను కాపాడామని రంగనాథ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. "బడా బాబులు ఆక్రమించిన వందల ఎకరాలను ధైర్యంగా కాపాడాం. ల్యాండ్ మాఫియా, కబ్జాదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారు. శాంతా శ్రీరామ్ అనే స్థిరాస్తి సంస్థ సుమారు రూ. 10 వేల కోట్ల మిగతా .. 2లో..

### ఆ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఒప్పుకోదు..

## ఇదే మా పందెం..



టెహ్రాన్, విశ్వం వాయిస్ న్యూస్ : అమెరికా- సౌదీ అరేబియా మధ్య కుదిరిన న్యూక్లియర్ ఒప్పందానికి ఇజ్రాయెల్ కచ్చితంగా అడ్డుతగులుతుందని ఇరాన్ జోస్యం చెప్పింది. ఆ రెండు దేశాల మధ్య ఒప్పందాన్ని ఎలాగైనా అడ్డుకొని తీరుతుందని పందెం వేసింది. పశ్చిమాసియా దేశాలకు న్యూక్లియర్ శక్తిని దూరం చేసేందుకు ఇజ్రాయెల్ ఎంతవరకైనా వెళ్తుందని ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'అణుశక్తిని శాంతియుతంగా వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి హక్కు' అని అన్నారు. అమెరికా మిగతా .. 2లో..

### అదేమీ చిన్న విషయం కాదు..

## సమయం పడుతుంది

### ఎయిరిండియా ఘటనపై కేంద్రం

విశ్వం వాయిస్ న్యూస్ : అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటనపై రాజ్యసభలో కేంద్రం కీలక వ్యాఖ్యలు చేసింది. తుది నివేదికల విడుదలపై తలెత్తుతున్న ప్రశ్నలకు బదులిస్తూ.. ఈ కేసు దర్యాప్తులో ఎటువంటి ఆలస్యం జరగలేదని స్పష్టంచేసింది. అదేమీ చిన్న సంఘటన కాదని.. అటువంటి భారీ ప్రమాదాల దర్యాప్తును పూర్తి చేయడానికి సమయం పడుతుందని తెలిపింది. భారీ విమాన ప్రమాదాల దర్యాప్తు అనేక అంశాలు.. వేర్వేరు పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని.. అందువల్ల తుది నివేదిక కోసం ఎంత సమయం పడుతుందనే విషయాన్ని ముందుగానే అంచనా వేయడం సాధ్యం కాదని వెల్లడించింది. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో కృషి చేస్తోందని పౌర విమానయానశాఖ పేర్కొంది. నిర్దేశిత విధానాల ప్రకారం దర్యాప్తు కొనసాగుతోందని తెలిపింది. ప్రమాదానికి దారితీసిన అన్ని కారణాలు, ఇతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### ఆగస్టు 1న విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని

# వైభవంగా నిర్వహించాలి

థీమ్ తో విమానాశ్రయం గురించి ప్రతీ ఇంటా చర్చ జరిగేలా విస్తృత ప్రచారం జరగాలని.. మహిళలు, యువత, పాఠశాల విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు చేరువయ్యేలా వేర్వేరు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అవుట్ రీజ్ కార్యక్రమాలు, క్విజ్, ఉపన్యాస పోటీలు, ఫ్లాష్ మాబ్ లు, డ్రోన్ షోలను నిర్వహించాలన్నారు. స్థానిక పారిశ్రామిక వేత్తలతోనూ రౌండ్ టేబుల్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు థీమ్‌తో 3-5కే రన్ లాంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన వారిని కూడా విమానాశ్రయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీక్షించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం జరిగేలా చూడాలని సూచించారు. మరోవైపు విమానాశ్రయం టెర్మినల్ భవనం ప్రారంభించిన అనంతరం ఇంధన, ఉపరితల రవాణా మంత్రిత్వశాఖలకు చెందిన రూ.18 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేస్తారని అధికారులు వివరించారు.

**2.30 గంటల పాటు భోగాపురంలో ప్రధాని పర్యటన**

ఆగస్టు 1 తేదీ ఉదయం 10.45 గంటలకు ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రధాని మోదీ చేరుకుంటారు. విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబులు స్వాగతం పలకనున్నారు. 10.58 గంటలకు విమానాశ్రయ టెర్మినల్ భవనాన్ని ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం సీఎం, గవర్నర్ తదితరులతో కలిసి ప్రధాని మోదీ టెర్మినల్ భవనాన్ని పరిశీలించనున్నారు. అక్కడి నుంచి బహిరంగ సభా వేదికకు ఓపెన్ టాప్ వాహనంలో ప్రయాణించనున్న ప్రధాని మోదీకి 13,500 మందికి పైగా గిరిజన మహిళలు, విద్యార్థులు సంప్రదాయ గిరిజన థింసా నృత్యంతో ఘన స్వాగతం పలకనున్నారు. 11.30 నుంచి 12.55 గంటల వరకూ బహిరంగ సభలో పాల్గొని, అనంతరం ప్రధాని 1.10 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు.

# అవగాహన కల్పించాలి

ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ఆదేశించారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. చదువులో టాపర్ అయిన విద్యార్థిని చనిపోవడం కలచివేసిందన్నారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ విద్యార్థుల మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతో పాటు టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యాశాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపైనా సీఎం సమీక్షించారు. సచివాలయంలో అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. భద్రత, ట్రాఫిక్, అతిథుల స్వాగత ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

# ఆ నియామకాలు చెల్లవ్

కష్టపడి సాధించాలి. ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎంతోమంది ఎదురుచూస్తున్నారు" అని వ్యాఖ్యానించింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన టీవీకే ర్యాలీలో చోటుచేసుకున్న తొక్కిసలాటలో 41 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని విజయ్ హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి కరూర్ వెళ్లి అర్హతలున్న 32 మందికి వివిధ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక నియామక పత్రాలను అందజేశారు. దీనిపై అన్నాడీఎంకే నేత ఆర్.బి. ఉదయ్‌కుమార్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టపరమైన విధానాలను పక్కనపెట్టి తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారంటూ హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎంతో మంది యువత తీవ్రంగా శ్రమిస్తున్నారని, ప్రభుత్వం ఏ ఉద్యోగ నియమాక ప్రక్రియ చేపట్టినా తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారానే చేపట్టాలని కోరారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం సీఎం విజయ్ చేపట్టిన ఈ నియామకాలు చెల్లబోవని తీర్పునిచ్చింది.

# విచారణకు సుప్రీంకోర్టు అనుమతి

ఇచ్చిన తీర్పులను కొట్టేస్తున్నట్లు పేర్కొంది. ఆ తీర్పులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 23న విచారించి ఉత్తర్వులు రిజర్వ్ చేసిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. నిందితుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన నాటినుంచి ఏడు రోజులపాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తున్నట్లు పేర్కొంది. పోలీసు కస్టడీ గడువు పూర్తయిన వెంటనే నిందితుడి విచారణకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్, వీడియోగ్రఫీ రికార్డింగ్‌లను విజయవాడ మెజిస్ట్రేట్‌కు అప్పగించాలని తెలిపింది. అందులో ఎలాంటి మార్పులు, చేర్పులు, తొలగించడం, చెరిపేయడం, ఎడిట్, ట్యాంపరింగ్ లాంటివి చేయకూడదని స్పష్టం చేసింది. పోలీసు కస్టడీ సమయంలో నిందితుడికి ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని పేర్కొంది.

# ఆ అభిమానాన్ని జీవితంలో మర్చిపోలేను

ముఖాముఖి నిర్వహించారు. సీఎం చంద్రబాబును ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు తమ కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. కుప్పంలో టూరిజం అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. పర్యాటకం అభివృద్ధి చెందితే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అంతకుముందు రామకుప్పం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భువనేశ్వరి పాల్గొన్నారు. కెంచనబల్లలో జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్క నాటారు.

# తీవ్ర విషాదంలోకి నెట్టేసింది

కలిగించింది. ఆరోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

**ఆమె మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి: మంత్రి లోకేశ్**

రంపచోడవరం మెగా పీటీఎంలో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదాన్ని నింపిందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి. సోదరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. ఎంత కష్టమైనా పోరాడుదాం.. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం.. మీకు నేనున్నాను.. ఈ ప్రభుత్వం ఉంది" అని లోకేశ్ పేర్కొన్నారు.

# ఏర్పాటుకు సహకరించండి

నిర్మాణానికి గతంలో సర్వే నిర్వహించారని, వన్‌సైడ్ ల్యాండింగ్ విధానంతో కూడేరు ప్రాంతంలో సర్వే చేయించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం అనంతపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దాలని సంకల్పించిందని, దీనికి ఎయిర్‌పోర్ట్ అవసరమని వివరించారు. సమావేశంలో అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# వ్యాఖ్యలు చేయలేదు

అధినేత చంద్రబాబుకు తెలుసు.. పార్టీ ఏంటో నాకు తెలుసు. కమిటీ ఎదుట హాజరై సమాధానాలు చెబుతా" అని బొండా ఉమా అన్నారు. గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంతాపసభలో అంబటి రాంబాబుతో బొండా ఉమామహేశ్వరరావు సన్నిహితంగా మెలగడం, అక్కడ చేసిన వ్యాఖ్యలపై తెదేపా అధినేత చంద్రబాబు వివరణ కోరారు. "ఏదైనా సమస్య ఉంటే పార్టీ అధిష్ఠానంతో మాట్లాడాలి. అంతర్గతంగా చర్చించాలి. అంతేకానీ వైకాపా నాయకులతో వేదిక పంచుకోవడం.. అక్కడ పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేసేలా మాట్లాడటం ఏంటి?" అని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి బొండా ఉమాను పిలిపించి వివరణ తీసుకోవాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులను ఆదేశించారు.

# పురోగతిపై పవన్ కళ్యాణ్ సమీక్ష

తాగునీటి పథకం విస్తరణ పనులు, భజన మందిరాల నిర్మాణ పురోగతి, దేవాదాయ శాఖ ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై శాఖలవారీగా అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా రహదారులన్నీ అభివృద్ధి చేయాలన్న పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 288 సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. క్షేత్రస్థాయికి వెళ్లి - నిర్మించిన రోడ్ల నాణ్యతను పరిశీలించాలని నియోజకవర్గ పర్యటనలో ఉన్న కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకు నిర్మించిన ప్రహరీ గోడల పనులను కూడా పరిశీలించాలని సూచించారు. యూ.కొత్తపల్లి మండల పరిధిలో తాగునీటి సరఫరాకు కీలకమైన నాగులాపల్లి సమగ్ర రక్షిత తాగునీటి పథక విస్తరణ పనులు పూర్తయ్యి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. త్వరలో చేపట్టబోయే పిఠాపురం పర్యటనలో ఈ పథకాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా సన్నాహాలు చేయాలని స్పష్టం చేశారు. నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, ఫిల్టర్ బెడ్లు, సంపుల నిర్మాణానికి సంబంధించి సమగ్ర నివేదిక రూపొందించాలన్నారు. యు.కొత్తపల్లి మండలంలోని 52 ఆవాసాలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించే లక్ష్యంతో ఈ తాగునీటి పథకం విస్తరణ పనులు చేపట్టారు.

**డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుపై పర్యవేక్షణ**

పిఠాపురం నియోజకవర్గవ్యాప్తంగా 191 పాఠశాలలు ఉండగా, సుమారు 18 వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో అందిస్తున్న ఆహార నాణ్యత ప్రమాణాలను కూటమి ప్రభుత్వం పటిష్టంగా అమలు చేస్తోందని.. పథక నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలని పేషీ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు మరింత నాణ్యమైన, పోషకాహారాన్ని అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పిఠాపురం మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ, గత పర్యటనలో పరిశీలించిన ఇందిరానగర్ డ్రెయిన్ అభివృద్ధి తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని పిఠాపురం, గొల్లప్రోలు మున్సిపాలిటీల్లో చెత్త సేకరణ, పరిశుభ్రత కార్యక్రమాల అమలులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించబోమని హెచ్చరించారు. నియోజకవర్గ పరిధిలోని ఏరియా ఆసుపత్రుల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, రోగులకు అందుతున్న సేవలు, 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పురోగతి తదితర అంశాలను సమీక్షించారు. సీజనల్ వ్యాధుల కాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న పిఠాపురంలోని ప్రధాన ఆలయాల్లో దేవాదాయ శాఖ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా టీటీడీ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన భజన మందిరాల ఏర్పాటు ప్రణాళికలను సమీక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 100 భజన మందిరాల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని, స్థల సేకరణ, ఆలయ కమిటీల ఏర్పాటు తదితర అంశాల్లో ఉన్న ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో కారణంగా ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి లభ్యత ఆధారంగా రైతులకు నీటి విడుదల క్యాలెండర్ రూపొందించి అందించాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

# 'మిషన్ శక్తిశాట్'కు ఎంపికైన విద్యార్థిని జెస్సీ

స్పేస్ సిటీ క్లస్టర్ కూడా ఒకటని, అంతరిక్ష రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని వివరించారు. మిషన్ శక్తిశాట్‌కు ఎంపికై రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని ఈ సందర్భంగా కందుల జెస్సీని మంత్రి లోకేష్ అభినందించారు. భవిష్యత్‌లో అన్ని విధాల అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మిషన్ శక్తిశాట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మిషన్ శక్తిశాట్ డైరెక్టర్, స్పేస్ కిడ్స్ ఇండియా సీఈవో డా.శ్రీమతి కేశన్, సంస్కార ఫౌండేషన్ అధ్యక్షురాలు డా.జ్యోత్స్న తిరునగరి, పాఠశాల ఉపాధ్యాయురాలు కే.మణిమాల పాల్గొన్నారు.

# స్టీమ్ రైస్ అందేలా ఏర్పాట్లు

చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రివర్యుల వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా మంత్రివర్యుల ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలుపెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ఎఫ్ఐడీ ను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యం లో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, ప్రజా పంపిణీలో మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే వివిధ అంశాలపై కేంద్ర మంత్రివర్యులతో సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

# నేను చేసిన తప్పు

విలువైన లోతుకుంట భూమిని కొట్టేయాలని చూసింది. అనుమతి లేకుండా చారిత్రక గుట్టలను బ్లాస్టింగ్ చేస్తున్నారు. చెట్లు, గుట్టలను శాంతా శ్రీరామ్ సంస్థ విచ్చలవిడిగా విధ్వంసం చేసింది. సేవ్ ది రాక్స్ ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. నాపై ఉన్న 63 కోర్టు ధిక్కరణ కేసులు బడా భూకబ్జాదారులు వేసినవే. బతుకమ్మకుంట చెరువును మింగేయాలని ఒకరు చూశారు. లోతుకుంటలో రూ.వేల కోట్ల ప్రభుత్వ భూమిని కొట్టేయాలని మరొకరు చూశారు. సామాన్యుల ప్లాట్లు కొట్టేసి కాంప్లెక్సులు కట్టాలని సంధ్యా శ్రీధర్‌రావు చూస్తున్నారు. సింగరేణి కార్మికుల ప్లాట్లను కొట్టేయాలని నల్ల మల్లారెడ్డి చూశారు. విలువైన సామాన్యుల ప్లాట్లు, ప్రభుత్వ భూములను ముఖీం ఆక్రమించారు" అని రంగనాథ్ తెలిపారు. "అక్రమార్కులందరికీ హైడ్రా కమిషనర్‌గా అడ్డుపడటమే నేను చేసిన తప్పు. కేసులను చట్టపరంగా ఎదుర్కొంటాను. నాకు న్యాయస్థానాలు, చట్టాలపై పూర్తి నమ్మకం, గౌరవం ఉన్నాయి. గత, ప్రస్తుత, భవిష్యత్తు ప్రభుత్వాలు ఏ బాధ్యతలు ఇచ్చినా పని చేస్తాను. ఏ పని అప్పగించినా 100 శాతం ఫలితాలు ఇవ్వడమే నా లక్ష్యం. భవిష్యత్తులోనూ ఇదే నిబద్ధతతో పనిచేస్తాను" అని రంగనాథ్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారంటూ రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పోస్టు నుంచి తప్పించాలని ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

# ఇదే మా పందెం..

బెదిరింపులకు ఇరాన్ లొంగబోదని, శక్తిమేర తనని తాను రక్షించుకుంటుందని ఇస్మాయిల్ పేర్కొన్నారు. శాంతి పవనాలు వీయాలా?యుద్ధం చెలరేగాలా అని నిర్ణయించే అధికారాన్ని అమెరికాకు ఇవ్వబోమని తెగేసి చెప్పారు. అమెరికా, ఇరాన్ మధ్య తాత్కాలిక శాంతి ఒప్పందం, ఆ తర్వాత హర్మూజ్ కేంద్రంగా మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగడంపై మీడియా ప్రశ్నించగా.. జాతి ప్రయోజనాలే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. ఇలాంటి విషయాల్లో నిర్దిష్ట నిబంధనలను అనుసరించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఇరాన్‌పై జరిగిన సైనిక దురాక్రమణకు అమెరికా బాధ్యత వహించాలన్నారు. అయితే, ఈ దాడుల వెనక కొన్ని ప్రాంతీయ దేశాల (గల్ఫ్‌దేశాలు) భాగస్వామ్యం కూడా ఉన్నట్లు ఆయన ఆరోపించారు. పౌర అవసరాల కోసం సౌదీ అరేబియాకు యురేనియం ఇచ్చేందుకు అమెరికా ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ మేరకు యురేనియం శుద్ధి సామర్థ్యాన్ని రియాద్ సమకూర్చుకునేందుకు ఆ దేశంతో 30 ఏళ్లపాటు అమల్లో ఉండే ఒప్పందానికి ట్రంప్ ఆమోదం తెలిపారు. ఇది అణ్వస్త్ర వ్యాప్తికి దారి తీయదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో స్పష్టం చేశారు. అయితే, ఈ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ కచ్చితంగా అడ్డుకుంటుందని ఇరాన్ చెప్పడం గమనార్హం.

# సమయం పడుతుంది

వెల్లడించింది. అయితే ఈ ఘటనపై ఇప్పటివరకు ఎటువంటి తుది నిర్ణయానికి రాలేదని వెల్లడించింది. ప్రస్తుతం విమాన 'థ్రస్ట్ కంట్రోల్ మాడ్యూల్'ను తనిఖీ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపింది. గతేడాది అహ్మదాబాద్‌లో టేకాఫ్ అయిన వెంటనే ఎయిరిండియా విమానం కుప్పకూలిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోవడం అందరినీ విషాదానికి గురిచేసిన విషయం తెలిసిందే.

# విద్యే వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తి

**విద్యార్థులకు పలు సూచనలు చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి - ఘనంగా డాక్టర్ పోతంశెట్టి రామారెడ్డి 80వ జయంతి వేడుకలు**

**ప్రతిభకు పట్టం కట్టిన కే.ఏ.ఆర్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల**



**అనపర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** అనపర్తి పరిసర ప్రాంతాల ప్రజలకు విశేష సేవలు అందించిన ప్రముఖ వైద్యులు డాక్టర్ పోతంశెట్టి రామారెడ్డి (రాము డాక్టర్) 80వ జయంతి వేడుకలు, పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమాలను అనపర్తి కే ఏ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యే వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తి అని, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ వాస్తు సిద్ధాంతి బ్రహ్మశ్రీ మిక్కిలి దుర్గయ్య శాస్త్రిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల పదో తరగతి ప్రజాపరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థుల విజయాలు పాఠశాలకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డాక్టర్ పోతంశెట్టి రామారెడ్డి సమాజానికి అందించిన వైద్య సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలోడాక్టర్ పోతంశెట్టి జానకిరామారెడ్డి, అనపర్తి పట్టణ కూటమి నాయకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనంటే నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం

**ఇంటింట ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల విశ్వాసమే కూటమి ప్రభుత్వ బలమని, రెండేళ్ళ కూటమి ప్రభుత్వ పాలనలో నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ప్రతి పేద వర్గానికి అందించామని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రెండేళ్ల నమ్మకం-సంక్షేమం, అభివృద్ధి 45 రోజుల ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఎన్నికల హామీల మేరకు అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించాలని సూచించారు. గత వైసిపి పాలన వల్ల గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను ఎన్డీఏ కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు గాడిలో పెట్టారన్నారు. అనేక పరిశ్రమలు, వ్యాపార పెట్టుబడులతో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తూ సమర్థవంతమైన పరిపాలన అందించడం జరుగుతుందన్నారు. ఈ



కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, క్లస్టర్,కో క్లస్టర్, బూత్, ఇన్చార్జి లు, వార్డు కమిటీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## ముహూర్తం ఫిక్స్... ఏపీలో మరో బిగ్ ఫైట్!

ఏపీలో మళ్ళీ రాజకీయ సమరం మొదలవనుంది. అతి పెద్ద రాజకీయ యుద్ధానికి రంగం సిద్ధం అవుతోంది. 2024 మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల తరువాత దాదాపుగా రెండున్నరేళ్ల అనంతరం స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. దీని కోసం ముహూర్తం ఫిక్స్ చేసినట్లుగా ప్రచారం సాగుతోంది. అన్నీ అనుకూలిస్తే దీని మీద తొందరలోనే అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు.

**ముందు మునిసిపోల్స్ :** ఇక సెప్టెంబర్ రెండో వారంలో మునిసిపల్ ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది అని అంటున్నారు. ఆ తరువాత దశలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారని అంటున్నారు. ఈ మొత్తం స్థానిక ఎన్నికల వ్యవహారం అంతా నలభై రోజుల వ్యవధిలో పూర్తి చేసేందుకు కూడా ప్రభుత్వం రూట్ మ్యాప్ ని సిద్ధం చేసింది అని అంటున్నారు. దీని మీద ఎన్నికల షెడ్యూల్ తొందరలోనే వెలువడుతుందని అంటున్నారు.

**వాటన్నింటికీ ఒకేసారి :** ఏపీలో మొత్తం 17 కార్పోరేషన్లు అలాగే 108 మునిసిపాలిటీలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయి. సెప్టెంబర్ రెండవ వారంలో వీటిని నిర్వహిస్తారు. దీంతో పాటుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు అలాగే ఎన్నికలు ఉంటాయని అంటునారు. ఇలా పట్టణాలతో పాటుగా మండల జిల్లా పరిషత్తు ఎన్నికలు సమాంతరంగా సాగుతాయని చెబుతున్నారు. అలా మునిసిపాలిటీలు కార్పోరేషన్లకు జెడ్పీలకు మండల పరిషత్తులకు పాలక వర్గాలు ఏర్పాటు అయ్యాయి. వీటిని పూర్తి చేసిన తరువాత ఏ మాత్రం ఆలస్యం చేయకుండా పంచాయతీ ఎన్నికలు కూడా పెడతారు అని అంటున్నారు.

**పల్లెల్లో తీర్పు కోసం :** ఇక ఆ మీదట అక్టోబర్ రెండో వారంలో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని చెబుతున్నారు. అంటే రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా ఉన్న పంచాయతీలకు సర్పంచులు వార్డు మెంబర్లకు ఎన్నికలు అన్న మాట. ఆ విధంగా మొత్తం ప్రక్రియను ముగించేయడం ద్వారా రాష్ట్రంలో విజయదశమి నాటికి స్థానిక పరిపాలన మొదలెట్టడం ప్రభుత్వం ఆలోచనగా కనిపిస్తోంది ఆ విధంగా స్థానిక సంస్థలు అన్నీ కూడా కళకళలాడతాయని అంటున్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా పూర్తి స్థాయిలో దృష్టి పెట్టింది. అన్ని ఎన్నికలను తొందరగానే నిర్వహించాలని సజావుగా సాగేలా చూడాలని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం అయితే సెప్టెంబర్ అక్టోబర్ నెలలు మంచి సీజన్ గా భావిస్తోంది. పైగా కూటమి ప్రభుత్వం పనితీరు మీద జనాభిప్రాయం కూడా ఈ విధంగా వెల్లడి అవుతుందని కూడా అంచనా వేస్తోంది. మొత్తం మీద చూస్తే ఏపీలో స్థానిక ఎన్నికల నగరా మోగాలి కానీ ఆ సందడి వేరే లెవెల్ లో ఉంటుందని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## వాటర్ ట్యాంకర్, బైక్‌ను ఢీకొట్టిన టెంపో.. ముగ్గురి మృతి



**శాంతిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిత్తూరు జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. శాంతిపురం మండలం కడపల్లి వద్ద జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కుప్పం - పలమనేరు మార్గంలో వెళ్తున్న టెంపో వాహనం.. కడపల్లి వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న తాగునీటి ట్యాంకర్‌తోపాటు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న శాంతిపురం మండలం బీరన కుప్పం గ్రామానికి చెందిన సుందరప్ప(60), ముని వెంకటమ్మ(50), తాగునీటి ట్యాంకర్ వద్ద నిలబడి ఉన్న ఓ చిన్నారి(4) అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులను కుప్పం ఆసుపత్రికి తరలించారు.

## విహారయాత్రలో విషాదం

### ఎస్సారెస్పీలో మునిగి ముగ్గురి మృతి.. ఒకరి గల్లంతు



ముజావత్



షేక్ ఖలీం



అర్హాన్



గల్లంతైన అజీం

**ముప్కాల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని శ్రీరామసాగర్ ప్రాజెక్టు వద్ద ఆదివారం విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రకు వచ్చిన ముగ్గురు నీట మునిగి మృతి చెందగా.. ఒకరు గల్లంతయ్యారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం..లక్ష్మీ కాల్వ పంప్‌హౌస్ ప్రాంతంలోని ప్రాజెక్టు వెనుక జలాల వద్ద నీటి నిల్వలు తక్కువగా ఉండటంతో ఆదివారం పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంది. మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన అర్హాన్ (17) నీటిలోకి దిగాడు. అతడు ప్రమాదవశాత్తు మునిగిపోతుండటంతో నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన షేక్ ఖలీం (24), నుజావత్ (24), అజీంలు రక్షించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో అర్హాన్‌తో పాటు ఖలీం, నుజావత్ నీటిలో మునిగి మృతి చెందారు. స్థానికుల సమాచారం మేరకు ఈతగాళ్లు వచ్చి వారి మృతదేహాలను బయటికి తీసుకొచ్చారు. అజీం కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ప్లేస్టోర్‌లో నకిలీ యాప్.. గూగుల్ ఇండియా అధిపతిపై కేసు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** గూగుల్ భారత విభాగం అధిపతిపై కేసు నమోదైంది. గూగుల్ ప్లేస్టోర్‌లో నకిలీ పెట్టుబడి యాప్ కారణంగా తాను రూ.7.95 లక్షలు నష్టపోయానని, ఈ నిర్లక్ష్యానికి బాధ్యుడైన గూగుల్ ఇండియా అధిపతి మీద చర్యలు తీసుకోవాలని ఓ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ ఠాణాలో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన వ్యక్తి (58) బీడీఎల్‌లో ఉద్యోగం చేస్తున్నారు. మార్కెట్ రీసెర్చ్ గ్రూపులో చేరాలంటూ ఈ నెల తొలి వారంలో ఆయనకో వాట్సప్ సందేశం వచ్చింది. గ్రూపులో చేరగా కరణ్ వర్మ, సంజీవ్ దాస్, సన్యా గుప్తా తదితరులు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల గురించి సలహాలు ఇస్తామని నమ్మించారు. వారి సలహాలు పాటించిన వారు భారీగా డబ్బు సంపాదించారంటూ గ్రూపులో పోస్టు చేశారు. నిజమని భావించిన సదరు ఉద్యోగి.. వారు చెప్పినట్లు గూగుల్ ప్లేస్టోర్ నుంచి జీవీఎస్ ఇన్‌స్టిట్యూషన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని.. ఈ నెల 10 నుంచి 26వ తేదీ వరకు రూ.7.95 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఆ పెట్టుబడికి రూ.27.75 లక్షల లాభం వచ్చినట్లు యాప్‌లో కనిపిస్తున్నా విత్‌డ్రాకు అవకాశం ఇవ్వలేదు. ట్యాక్స్ రూపంలో అదనంగా రూ.9.26 లక్షలు పంపిస్తేనే విత్‌డ్రాకు అవకాశముంటుందని మెలిక పెట్టారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. ప్లేస్టోర్‌లో నిజమైన యాప్‌లు ఉంటాయని నమ్మి డౌన్‌లోడ్ చేసుకున్నానని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన గూగుల్ ఇండియా నోడల్ హెడ్‌పై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

## కర్నూలులో కాల్పుల కలకలం

### బ్యాడ్మింటన్‌లో ఓటమి నేపథ్యంలో రగడ



**కర్నూలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్నూలు నగరంలో ఆదివారం రాత్రి ఓ స్థిరాస్తి వ్యాపారి మద్యం మత్తులో కాల్పులు జరిపిన ఘటన కలకలం రేపింది. స్థానిక చాణక్యపురికాలనీలోని వీఆర్ఎస్ బ్యాడ్మింటన్ అకాడమీలో కర్నూలు బ్యాడ్మింటన్ ప్రీమియర్ లీగ్ సెషన్ పేరిట టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్, ముగింపు కార్యక్రమానికి మాజీ ఎంపీ టీజీ వెంకటేష్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. క్రీడాకారుల కుటుంబసభ్యులు, స్నేహితులు కూడా పెద్దసంఖ్యలో వచ్చారు.

**అశోక్‌రెడ్డిని విచారిస్తున్న పోలీసులు**

ఈ పోటీల్లో అశోక్‌నగర్‌కు చెందిన స్థిరాస్తి వ్యాపారి కౌశిక్ టీం ఓడిపోయింది. అనంతరం కౌశిక్ తన మిత్రుడు, హైదరాబాద్‌కు చెందిన అశోక్‌రెడ్డితో కలిసి మద్యం మత్తులో మరో స్నేహితుడు, కర్నూలుకు చెందిన శ్రీకుమార్‌రెడ్డితో గొడవపడ్డారు. స్థానికులు వారిని అకాడమీ నుంచి బయటకు పంపేశారు. ప్రధాన రహదారిపైకి చేరుకున్న కౌశిక్ ఆగ్రహంతో తన వద్ద ఉన్న రివాల్వర్‌ను బయటకు తీసి గాల్లోకి రెండు రౌండ్లు, నేలపైకి ఓ రౌండ్ కాల్పులు జరిపారు. స్థానికులు అతడిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులకు బుల్లెట్ రవ్వలు తగిలినట్లు తెలిసింది. కర్నూలు త్రీటౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కౌశిక్, అశోక్‌రెడ్డిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కౌశిక్‌కు ఆయుధ అనుమతి ఉన్నట్లు గుర్తించారు. కాగా అతడి వద్ద రివాల్వర్ దొరకలేదు. రివాల్వర్ పెట్టుకొనే తొడుగు మాత్రం లభ్యమైంది. రివాల్వర్ ఎవరికైనా ఇచ్చి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.



# తాటాకు చప్పుళ్లకు భయపడం

**డీఎస్సీ అక్రమాలపై లోకేశ్ రాజీనామా చేయాలి - 28న జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగులు, డీఎస్సీ అభ్యర్థులతో నిరసన ర్యాలీలు**

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి బెదిరించాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అటువంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సమస్యలపై పోరాటం నుంచి వెనక్కి తగ్గబోమని అన్నారు. రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు. సిదిరి అప్పలరాజు, కారుమూరి సునీల్, అంబటి రాంబాబు, జోగి రమేష్, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తదితరుల అరెస్టులు ఇందుకు ఉదాహరణలని పేర్కొన్నారు. కర్నూలు నగర యువజన విభాగం అధ్యక్షుడు బాలును కొట్టి భయపెట్టి అక్రమ కేసులు పెట్టారని ప్రశ్నించినందుకు తనపై కూడా కేసు నమోదు చేశారని తెలిపారు. రంగంపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని ప్రశ్నించినందుకు కేసులు పెట్టారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదని స్పష్టం చేశారు. తన తండ్రి, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు తెలుగుదేశం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన సమయంలో 65 కేసులు పెట్టారని గుర్తు చేశారు. తన తల్లి విజయలక్ష్మి కూడా ప్రజా సమస్యలపై పోరాడినందుకు కేసులు పెట్టి జైలుకు పంపారని తెలిపారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తన తల్లిదండ్రులు ప్రజా ఉద్యమాల ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని, వారే తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు తన తల్లిపై గతంలో అనేక కేసులు నమోదు చేసి జైలుకు పంపినా వెనక్కి తగ్గలేదని అన్నారు. తల్లిదండ్రులను ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యలపై పోరాడటంలో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గోడకు కొట్టిన బంతిలా ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా అంతకంతకూ బలంగా తిరిగి పోరాడతామని రాజా అన్నారు. ఢిల్లీలో ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం స్పందించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించిందని తెలిపారు. ఎవరైనా అహంకారంతో ఏది చేసినా చెల్లుబాటు అవుతుందని భావించడం సరికాదని అన్నారు. అధికార మదంతో వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఢిల్లీ ఘటన నిరూపించిందన్నారు. రాష్ట్రంలో డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇదే కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా డీఎస్సీ అక్రమాలపై స్పందించి బాధ్యత వహించాల్సిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాజీనామా చేయడానికి ఎవరూ అతీతులు కాదని అన్నారు. క్రీడా కోటా నియామకాలు, ఫలితాల ప్రకటన, రిజర్వేషన్ల నిబంధనలను పక్కన పెట్టి డీఎస్సీ నియామకాల్లో అనేక అవకతవకలు జరిగినట్లు ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై గొప్పలు చెప్పుకున్న కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో సుమారు రూ.9 వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. డీఎస్సీ అక్రమాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఉద్యమాలు, ధర్నాలు చేపడతామని ప్రకటించగానే కొద్దిమొత్తంలో నిధులు విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని రాజా అన్నారు. అనంతరం వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను సమర్థంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు వసతి, జీవన ఖర్చుల కోసం రూ.20 వేలు అదనంగా అందించారని తెలిపారు. పాఠశాల విద్య నుంచి కళాశాల విద్య వరకు వ్యవస్థను గాడిలో పెట్టేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నాడు--నేడు కార్యక్రమం ద్వారా రూ.14 వేల కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిందని, విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ విఫలమయ్యారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈనెల 28న రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేపడతామని వెల్లడించారు. రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎక్కడైనా కంటికి కనిపించే అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో కోటి మంది నిరుద్యోగులు ఉన్నారని ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే పత్రికల్లోనే వార్తలు వచ్చాయని అన్నారు. రెండేళ్లుగా ఒక్క నిరుద్యోగికీ నిరుద్యోగ భృతి అందించలేదని విమర్శించారు. ఇప్పటివరకు మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టినా ఏ ఒక్క బడ్జెట్‌లోనూ నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. నిరుద్యోగులు, యువత సమస్యలపై ఈనెల 28న అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు జక్కంపూడి రాజా తెలిపారు. నిరుద్యోగులు, యువకులు, డీఎస్సీ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో జరిగిన ఉద్యమాన్ని ఆదర్శంగా తీసుకుని డీఎస్సీ అవకతవకలపై ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని అన్నారు. యువత తమ జీవితాలను మెరుగుపరుచుకునేందుకు పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు.

# ముర్రం శివాని మృతి అత్యంత విషాదకరం

**పూర్తి స్థాయి దర్యాప్తు జరిపిస్తాం - ఘటనపై సీఎం విచారం**
**పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్**






**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ముర్రం శివాని బలవన్మరణం అత్యంత బాధాకరమైన సంఘటన అని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి , వారి కుటుంబ సభ్యులకు సంతాపం వ్యక్తం చేయడం జరిగింది. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో శివాని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రంపచోడవరం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. స్వాతి, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి అశ్రఫ్ అలీతో కలిసి శివాని మృతికి సంబంధించిన పరిస్థితులు, ఘటనకు దారితీసిన కారణాలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. మంచి భవిష్యత్తు ఉన్న విద్యార్థిని ఈ విధంగా కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్న కలెక్టర్, శివాని ఆత్మకు శాంతి చేకూరాలని, ఆమె కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని జిల్లా యంత్రాంగం తరఫున ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేసినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, ఏజెన్సీ డీఈవో వై. మల్లేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు, డాక్టర్ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రంపచోడవరంలో

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్.మాధవన్ పర్యటన



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవన్ నేడు (మంగళవారం)పోలవరం జిల్లా, రంపచోడవరంలో పర్యటించనున్నారని భారతీయ జనతా పార్టీ పోలవరం జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలుదొర తెలిపారు. ఈ పర్యటన సందర్భంగా భారతీయ జనతా పార్టీ పోలవరం జిల్లా నూతన జిల్లా కమిటీతో పాటు అన్ని మండల కమిటీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ విస్తరణ, గ్రామస్థాయి నుండి పార్టీని మరింత పటిష్ఠం చేసే కార్యాచరణ, భవిష్యత్ కార్యక్రమాలపై రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్. మాధవన్ దిశానిర్దేశం చేయనున్నారు. పోలవరం జిల్లా నూతన కమిటీ సభ్యులు, మండల కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మోర్చాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు అందరూ సమయానికి హాజరై ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు ఈకా బుల్లికొండలుదొర పిలుపునిచ్చారు.

# ప్రజల గడపకే ప్రజాపాలన : బొడ్డు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం మండలం పాలచర్లలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో "ఇంటింటికి తెలుగుదేశం (డోర్ టు డోర్)" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజానగరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి, ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేస్తూ, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. గ్రామాల్లో ఈ కార్యక్రమానికి మంచి స్పందన వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గంగిశెట్టి చంటిబాబు, తనకాల నాగేశ్వరరావు. అడపా వీరబాబు, కందుల బాబు రాయుడు, చిట్టిప్రోలు పద్దరాజు, తెలగంశెట్టి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతి నిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరాలవ్యాధి మహిళకు పీఎంపీలు

# 20 వేలు ఆర్థిక చేయూత



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** మండలంలోని మధురపూడికి చెందిన సత్యవోలు శ్రీవల్లి అనే మహిళ కొంతకాలంగా నరాలకు సంబంధించిన ఐజీఏ న్యూరోపతి అనే వ్యాధితో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటుందని పిఎంపిల సంఘ అధ్యక్షులు వినోద్ తెలిపారు. సోమవారం కోరుకొండ మండలంలోని కమ్యూనిటీ పారామెడిక్స్ ఞ ప్రైమరీహెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఆధ్వర్యంలో కోశాధికారి బీహెచ్ శివకుమార్ తెలిపిన సమాచారం మేరకు మండల అధ్యక్షుడు కుంచె వినోద్, సంఘ సభ్యులు 20వేల రూపాయలు ఆర్థిక సహాయం బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా నరాల వ్యాధితో ఆమె తీవ్రంగా బాధపడుతుందని, సంఘ సభ్యులకు ఆదేశాల మేరకు ఆర్థిక సహాయాన్ని అందించమన్నారు. ఈ సందర్భంగా బాధితురాలు పీఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎంపీల మండల అధ్యక్షులు కుంచే వినోద్, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగపట్నం గ్రామస్తులకు సత్యసాయి త్రాగునీరు ఇప్పించాలి

**సత్యసాయి త్రాగునీటి కోసం కలెక్టర్కు వినతిపత్రం.**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీరంగపట్నం గ్రామానికి సంబంధించి సుమారు పదివేల జనాభా ఉంటుందని గ్రామస్తులకు సత్యసాయి త్రాగునీటి ఇప్పించాలని వైఎస్ఆర్సిపి నాయకుల ఆధ్వర్యంలో కలెక్టర్కు వినతిపత్రం సమర్పించినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం రాజమహేంద్రవరం పిజి ఆర్ఎస్ లో గ్రామస్తులు సత్యసాయి మంచినీటి కోసం వినతి పత్రం సమర్పించమని, సంబంధిత అధికారులు స్పందించి మంచినీరు ఇప్పించాలన్నారు. మండలంలో ప్రజలకు సురక్షితమైన త్రాగునీరు అందడం లేదని, దీంతో ప్రజా ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. గోదావరి జలాలు చెంతనే ఉన్న ప్రజలకు త్రాగునీరు సక్రమంగా అందడం లేదని, అదేవిధంగా వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ లేకపోవడంతో ప్రజారోగ్యానికి తూట్లు పడుతున్నాయన్నారు. ప్రజాప్రతితులు అధికారులు ప్రజారోగ్య దృష్ట్యా, సక్రమమైన గోదావరి జిల్లాలను అందించి ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి కుటుంబరావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విమానాశ్రయం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయాలి

**డీఎస్సీ అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి**

**తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఆగస్టు 1న ప్రభుత్వం నిర్వహించనున్న ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తెలుగు శక్తి పూర్తిగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. సోమవారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం బి.వి.రామ్ మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవంపై ఇప్పటికే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రపతికి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. హిందూ సంప్రదాయాల ప్రకారం ఆషాఢమాసంలో శుభకార్యాలు నిర్వహించరని, అయితే దేశానికి ఉపయోగపడే కార్యక్రమాల విషయంలో సంప్రదాయాలు, ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొనే ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రోటోకాల్‌లో స్థానిక ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పేరు లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్షాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వకుండా కేవలం నారా లోకేష్ పేరుకే ప్రాధాన్యం కల్పించడం సరైన విధానం కాదని విమర్శించారు. దేశంలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న సమయంలో సుమారు రెండు లక్షల మందితో భారీ కార్యక్రమాన్ని నిర్వహించడం సరికాదన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ఒకేచోట గుమిగూడితే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితుల్లో బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

**డీఎస్సీ అవకతవకలకు నైతిక బాధ్యత వహించాలి**

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, అదే విధంగా డీఎస్సీ నియామకాల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా రాజీనామా చేయాలని బి.వి.రామ్ డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన అనంతరం స్వతంత్రంగా విచారణ జరిపించి, కోర్టు తీర్పుతో నిర్దోషిగా బయటకు వచ్చి ప్రజలకు ఆదర్శంగా ముఖ్యమంత్రిగా పరిపాలించాలని సూచించారు. డీఎస్సీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అమరావతి పేరుతో రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని, ప్రజలపై ఆర్థిక భారం పెంచుతున్నారని బి.వి.రామ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి సారించి పారదర్శకమైన, ప్రజా ప్రయోజనాలకు అనుగుణమైన పాలన అందించాలని డిమాండ్ చేశారు.

# కూటమి రాకతో కుదేలైన విద్యారంగం

**గణనీయంగా తగ్గిన విద్యార్థుల సంఖ్య - మాజీ కౌన్సిలర్ రవి కుమార్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని వైయస్సార్ పార్టీ నియోజకవర్గ ఆర్ టీ ఐ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల మూసివేత, విద్యార్థుల సంఖ్య తగ్గుదలపై కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యుడైస్ నివేదికే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. మండపేటలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం వెనుకబడిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన యుడైస్ నివేదిక ప్రకారం రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 972 పాఠశాలలు మూతపడ్డాయని, అందులో 778 ప్రభుత్వ, 194 ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. గత ఏడాదిలోనే 644 పాఠశాలలు మూతపడటం ఆందోళనకర పరిణామం అని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 45 వేల నుంచి 44,222కు, ఎయిడెడ్ పాఠశాలలు 991 నుంచి 797కు తగ్గిపోయాయని పేర్కొన్నారు. అలాగే 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 40,50,116 మంది విద్యార్థులు ఉండగా, 2025-26 నాటికి ఆ సంఖ్య 34.93 లక్షలకు పడిపోయిందని, అంటే సుమారు 5.86 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయారని చెప్పారు. నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలు నిర్వీర్యమవుతున్నాయని రవికుమార్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన 'నాడు-నేడు', మధ్యాహ్న భోజన పథకాల బలహీనత వల్లే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగం పరిస్థితిని మెరుగుపర్చేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.








# ఎస్ఎస్ అరేక ప్లేట్స్ పరిశ్రమను సందర్శించిన జిల్లా కలెక్టర్



**అమలాపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణకు దోహదపడే పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా సహజ వనరులతో తయారయ్యే ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉందని జిల్లా కలెక్టర్ డా. రావిరాల మహేష్ కుమార్ తెలిపారు.సోమవారం అయినవిల్లి మండలం శానపల్లి లంక గ్రామంలోని ఎస్ఎస్ అరేక ప్లేట్స్ తయారీ పరిశ్రమను సందర్శించిన కలెక్టర్, వ్యవసాయ రైతు కోరుమిల్లి సురేష్తో కలిసి పరిశ్రమలో జరుగుతున్న ఉత్పత్తి ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, ఉపాధి అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పరిశ్రమలో ముడి పదార్థాల సేకరణ నుంచి తుది ఉత్పత్తి వరకు తయారీ విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, పరిశ్రమలో వినియోగిస్తున్న హైడ్రాలిక్ యంత్రం, పెట్టుబడి వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. కోయంబత్తూర్ నుంచి సుమారు రూ.5 లక్షల వ్యయంతో హైడ్రాలిక్ యంత్రాన్ని కొనుగోలు చేశామని, మొత్తం పరిశ్రమ ఏర్పాటుకు రూ.12 లక్షలు ఖర్చయ్యాయని రైతు వివరించారు. వక్క ఆకులతో ప్రసాదం, టిఫిన్, డిన్నర్ ప్లేట్లను తయారు చేస్తున్నట్లు తెలిపారు.చిన్న తరహా పరిశ్రమలకు కరెంట్ సబ్సిడీ, బ్యాంకు రుణాలు, కార్మిక వ్యయంపై ప్రభుత్వ ప్రోత్సాహం కల్పించాలని రైతు కోరగా, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. స్థానికంగా లభించే సహజ వనరులను వినియోగించి విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా గ్రామీణ యువతతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఇలాంటి పరిశ్రమలకు శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పరిశ్రమ యాజమాన్యం ఉత్పత్తి సామర్థ్యం, ఉపాధి కల్పన, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలను కలెక్టర్‌కు వివరించింది.ఈ కార్యక్రమంలో అయినవిల్లి తహసీల్దార్ విద్యాపతి, గ్రామ అధ్యక్షుడు కడలి శంకరరావు, తెలుగు యువత నాయకుడు మతుకుపల్లి జానకిరామ్, కోరుమిల్లి సాంబశివరావు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాంకు

## నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం ప్రభుత్వ వైద్యశాలలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త, "మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా" డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కలాం విగ్రహానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి. గన్నవరం ప్రభుత్వ వైద్యశాలకు రూ.2.80 లక్షల విలువైన ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన ఆధునిక వైద్య పరికరాలను అందజేశారు. ఎమ్మెల్యే ఆ పరికరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు అధికారికంగా అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులను అభినందిస్తూ, ఈ పరికరాల ద్వారా ప్రభుత్వ వైద్యశాలలో మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన డాక్టర్ అబ్దుల్ కలాం గారు తమ కృషి, క్రమశిక్షణ, పట్టుదలతో దేశ అత్యున్నత పదవిని అధిరోహించి కోట్లాది భారతీయులకు స్ఫూర్తిగా నిలిచారని అన్నారు. భారత రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో, అగ్ని, పృథ్వి వంటి క్షిపణుల అభివృద్ధిలో, పోఖ్రాన్ అణు పరీక్షల విజయవంతమైన నిర్వహణలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ విద్యార్థులు, యువతతో మమేకమై వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన గొప్ప వ్యక్తిగా డాక్టర్ కలాం గారు నిలిచారని పేర్కొన్నారు. "కలలు కనండి... కానీ నిద్రలో కనిపించే కలలు కాదు, మిమ్మల్ని నిద్రపోనివ్వని కలలు కనండి" అనే ఆయన సందేశం నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు.డాక్టర్ కలాం వర్ధంతిని కేవలం నివాళులర్పించే కార్యక్రమంగా కాకుండా, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టే సంకల్ప దినంగా భావించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, జనసైనికులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలు పాల్గొని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఘన నివాళులర్పించారు.

## పల్లంకుర్రులో నెలల తరబడి నిలిచి ఉన్న అనుమానాస్పద కారు



### కాట్రేనికోన పోలీసులు స్పందించాలని స్థానికుల విజ్ఞప్తి

**కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండలం పల్లంకుర్రు గ్రామంలోని చింతలచెరువు శివాలయం రోడ్డులో గత కొన్ని నెలలుగా గుర్తుతెలియని ఒక హోండా కంపెనీ కారు రోడ్డు పక్కన పాడుబడిన స్థితిలో నిలిపి ఉంచడం స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఎటువంటి సమాచారం లేని ఈ వాహనం సుదీర్ఘ కాలంగా ఒకే చోట ఉండటంతో, దీని వెనుక ఏదైనా నేరపూరిత కోణం ఉందా లేదా ఏవైనా అసాంఘిక కార్యకలాపాలకు దీనిని ఉపయోగించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ కారు పరిసరాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం పెరుగుతుండటంతో మహిళలు, చిన్నపిల్లలు మరియు స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ విషయంపై కాట్రేనికోన పోలీసులు తక్షణమే స్పందించి, సదరు వాహన యజమాని వివరాలను రికార్డుల ద్వారా సేకరించి, అనుమానాస్పద కారును ఇక్కడి నుండి తరలించి శాంతిభద్రతలను కాపాడాలని గ్రామస్తులు పత్రికా ముఖంగా గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

రెండేళ్ల కూటమి పాలన - అభివృద్ధి, సంక్షేమంతో

## ప్రతి ఇంటా పండుగ వాతావరణం

### ఉప్పలగుప్తం మండలంలో 2 ఏళ్ల నమ్మకం ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, అమలాపురం నియోజకవర్గంలో "2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" పేరిట చేపట్టిన బృహత్తర ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం ప్రారంభించారు. ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం గ్రామంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు గ్రామ వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను పలకరించారు. కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. బాధితులు తెలిపిన సమస్యలను అక్కడికక్కడే మైటీడీపీ (మై టిడిపి) యాప్‌లో నమోదు చేయించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ సుపరిపాలన అందిస్తోంది. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను నమోదు చేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్-యూనిట్-బూత్ (సీయూబీ) ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంటల బీమా నమోదును వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఖరీఫ్ సీజన్‌లో అర్హులైన ప్రతి రైతు పంటల బీమా పథకం కింద నమోదు చేసుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు (ఎంఏవోలు), రైతు సేవా కేంద్రాల (ఆర్ఎస్‌కే) సిబ్బందితో సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన పంటల బీమా నమోదు పురోగతిని సమీక్షించారు. జిల్లాలో సుమారు 1.13 లక్షల ఎకరాల్లో వరి సాగు లక్ష్యంగా ఉండగా, ఇప్పటివరకు 63,467 ఎకరాల్లో (56 శాతం) నాట్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. రామచంద్రపురం, ఆలమూరు, ఆత్రేయపురం, రావులపాలెం మండలాల్లో 80 శాతానికి పైగా నాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పి ఎం ఎఫ్ బి వై ) కింద వరి పంట బీమా నమోదు గడువు ఆగస్టు 15 వరకు ఉన్నప్పటికీ, ఆగస్టు 10 నాటికే వంద శాతం నమోదు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులు ఎకరానికి రూ.76 ప్రీమియం చెల్లించి పీఎంఎఫ్‌బీవై యాప్ లేదా రైతు సేవా కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో అరటి సాగు జరుగుతోందని, ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో అధిక విస్తీర్ణం ఉందని వెల్లడించారు. పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద అరటి పంట బీమా నమోదు జూలై 31 వరకు కొనసాగుతుందని, ఎకరానికి రూ.3,000 ప్రీమియం చెల్లిస్తే సుమారు రూ.60 వేల బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు, తెగుళ్ల వల్ల కలిగే నష్టాలకు రక్షణ ఉంటుందని వివరించారు. కౌలు రైతులు కూడా ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం లేదా స్వీయ ధృవీకరణ పత్రం (సెల్ఫ్ డిక్లరేషన్), బ్యాంకు ఖాతా వివరాలతో రైతు సేవా కేంద్రాల ద్వారా సులభంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, అకాల వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులందరూ గడువు ముగిసేలోగా పంటల బీమా నమోదు చేసుకుని ఆర్థిక రక్షణ పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో ఉద్యానవన శాఖ జాయింట్ డైరెక్టర్ బి.వి. రమణ, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. రామారావు, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలకు సత్వర న్యాయం అందించడమే

## పోలీసు శాఖ ప్రధాన లక్ష్యం

### జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటికి సత్వర పరిష్కారం చూపే లక్ష్యంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తేతో కలిసి బాధితుల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులతో ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను ఓర్పుతో విన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 27 ఫిర్యాదులు నమోదయ్యాయి.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) మహేంద్ర మత్తే, డీపీఓ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గడప గడపకి కూటమి ప్రభుత్వం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం కే.పెదపూడి గ్రామంలో గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ...రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం ఘనంగా జరిగింది. కూటమి ప్రభుత్వం రెండేళ్ల అభివృద్ధి సంక్షేమం కార్యక్రమలను ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరిస్తూన్న గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పి గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కో- కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ. గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తిరుమనాదం హనుమంతరావు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు అంబాజీపేట మండలం టీడీపీ కార్యదర్శి గుంటూరి మురళీకృష్ణం రాజు, ఒఎస్‌వో సభ్యులు పేచ్చెట్టి హరిబాబు, టీడీపీ నాయకులు మంద రాజేష్, ఉండుర్తి పరంజ్యోతి, చిక్కం పల్లం రాజు, పితాని నాగరాజు మోకా శ్రీను, పెట్ట కృష్ణ కిషోర్, ఏళ్ళ సత్యనారాయణ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కె.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

## మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీసు శాఖ పరిధిలోని మాదకద్రవ్యాల నిరోధక ప్రత్యేక విభాగం ఆధ్వర్యంలో కె.గంగవరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారి ఏ.కే. రవికృష్ణ, జిల్లా పోలీసు అధికారి కె.ఎం. మహేశ్వరరాజు, మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసు సూపరింటెండెంట్ డి. స్వరూప రాణి మార్గదర్శకత్వంలో, వృత్తాధికారి వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు చైతన్యం, గరుడ, సురక్షిత విద్యాసంస్థల ప్రాంగణం, ఉమ్మడి శిక్షణా కార్యాచరణలతో పాటు ప్రత్యేక విభాగం నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలు, కుటుంబాలపై పడే ప్రతికూల ప్రభావం, అలాగే మాదకద్రవ్యాల నిరోధక చట్టం ప్రకారం నేరాల్లో చిక్కుకుంటే ఎదురయ్యే కఠిన శిక్షలు, భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి విద్యార్థులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా 1972 ఉచిత సహాయ కేంద్రం సంఖ్య ద్వారా పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అలాగే అంతర్జాల నేరాలపై కూడా విద్యార్థులకు అవగాహన కల్పించి, చివర్లో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ప్రత్యేక విభాగం పాఠశాల సమన్వయకర్త పితాని శ్రీనివాసు, మహిళా సమన్వయకర్త నక్కలల్లి, ప్రత్యేక విభాగం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 275 మంది విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణానికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## ఓఎన్జీసీ నిధులతో సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పోలమ్మ చెరువుగట్టు సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఓఎన్‌జిసి కాకినాడ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభ్లేన్ గుప్తాతో కలిసి శంకుస్థాపన చేశారు. కోటి రూపాయల ఓఎన్జీసీ సిఎస్ఆర్ నిధులతో వాకింగ్ ట్రాక్, కంచె ఏర్పాటు చేయనున్నారు. సిఎస్ఆర్ నిధుల ద్వారా ఓఎన్‌జిసి అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు వస్తువులు పంపిణీ



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం సాంఘిక సంక్షేమ శాఖ బాలికల హాస్టల్లో సోమవారం ప్రభుత్వం విద్యార్థినుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వసతుల కింద వివిధ ఉపయోగకరమైన వస్తువులను ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, అదేవిధంగా హాస్టల్లో ఉండే విద్యార్థులకు సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తుందన్నారు.

## దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు

### ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలంలో దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం అందించిన ఉచిత మోటార్ సైకిళ్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. మండలంలో మొత్తం ఆరుగురికి ఈ మోటారు సైకిళ్లు అందగా వారంతా సోమవారం ఉదయం ఆలమూరులో ఎమ్మెల్యే బండారు పర్యటనలో పాల్గొని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకునేలా, వారికి స్వతంత్ర జీవనాన్ని కల్పించేందుకు ఈపథకం ఉద్దేశించబడిందని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడి గత గొడ్డలి పార్టీ ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో దివ్యాంగులకు లభిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2019 నుంచి 2024 వరకు 2019కు ముందు చంద్రబాబు నాయుడు తమకు ఇచ్చిన పింఛన్ మొత్తం రూ.3వేలు మాత్రమే అందేదని 5 ఏళ్లలో ఒక్క రూపాయి కూడా వైసిపి హయాంలో పెంచలేదని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ మొత్తాన్ని రూ.6 వేలు చేసి ప్రభుత్వం తమను ఆదుకుందని దివ్యాంగులు తెలిపారు. దివ్యాంగులకు కూటమి ప్రభుత్వంలో అన్ని విధాలా లబ్ధి జరుగుతుందన్నారు.

### సోలార్ ఎనర్జీని వినియోగించుకోవాలి

ప్రభుత్వం సోలార్ ఎనర్జీ ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించిందని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా సోలార్ యూనిట్ అమర్చుకోవడానికి అవకాశం కల్పిస్తుందని, బిసి ఓసి వర్గాలకు రూ.78 వేలు సబ్సిడీ అందిస్తుందని అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఆలమూరులో ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసుకున్న సోలార్ యూనిట్ లను ఎమ్మెల్యే బండారు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గాలకు కూటమి ప్రభుత్వం ఎన్నో ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. సోలార్ యూనిటీ ఏర్పాటును ఉచితంగా చేయడంతో పాటు నెలకు రూ.200లను వారికి అద్దె రూపంలో చెల్లిస్తుందన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బిజెపి నేత పాలూరికి దస్తావేజుల లేఖరులు వినతిపత్రం అందజేత

### 396 నువ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31 వరకు పెన్డౌన్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారుల సొంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 396 నువ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 31 వరకు పెన్డౌన్ పేరుతో లేఖరులు సమ్మె చేస్తున్నారు. దీనిలో భాగంగా కొత్తపేట రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్ద కొత్తపేట దస్తావేజుల లేఖరులు దీక్ష చేస్తున్నారు.అక్కడికి విచ్చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందంకి లేఖరులు తమ సమ్మెకు మద్దతు తెలపాలంటూ కోరడంతో పాటూ అదే విధంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి. వి. ఎన్ మాధవ్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఈ జీవోని వెనక్కి తీసుకొనే విధంగా చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 లక్షల కుటుంబాలు దస్తావేజుల లేఖరులుగా, దాని అనుబంధ వృత్తి దారులుగా జీవిస్తున్నామని తరతరాలుగా వారి వంశంలో పెద్దలు గ్రామ కరణాలుగా కొలతలు సర్వేలు చేస్తూ ఎంతోమంది ప్రజలకు అనేక రకాలైన పత్రాలు, దస్తావేజులు తయారీ మరియు రాయడం ద్వారా సమాజానికి సేవచేయడంతో పాటూ కక్షిదారులు సంతోషంగా ఇచ్చే భృతితో కుటుంబాలను పోషించేవారనీ మేము కూడా దస్తావేజుల లేఖరులుగా జీవిస్తున్నామని ఇప్పుడు ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ జీవోతో లక్షలాది కుటుంబాలు రోడ్డున పడతాయనివాపోయారు. పాలూరి సత్యానందం మాట్లాడుతూ లేఖరుల జీవన భృతికి సంబంధించిన న్యాయమైన ఈ అంశాన్ని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి. వి. ఎన్ మాధవ్ దృష్టికి తీసుకెళ్లి వారి ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మీ సమస్యలు వివరించి మీకు న్యాయం చేకూర్చే విధంగా ప్రయత్నిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు కోటిపల్లిదామోదర్ మరియు మండల లేఖరుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికుల రక్షణే లక్ష్యం..



### ఆర్టీసీ బస్టాండ్‌లో సీఐ వీరబాబు తనిఖీలు


**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలో మహిళలు, కాలేజీ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ, సోమవారం అమలాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టణ సీఐ పి.వీరబాబు భద్రతా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ఉన్న కాలేజీ విద్యార్థులు, మహిళా ప్రయాణికులతో మాట్లాడిన సీఐ, ప్రయాణాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో అనవసరంగా మాట్లాడవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళల భద్రతే పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్న సీఐ పి.వీరబాబు, ప్రజలు అప్రమత్తంగా ఉంటే నేరాలను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. ఈ భద్రతా తనిఖీలతో బస్టాండ్‌లో ప్రయాణికులకు భరోసా కలిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

## జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన శివల విద్యార్థులు



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జూలై 27న అమరావతి క్రీడా పోటీలు 2026లో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి 17, 23 ఏళ్ల లోపు బాలుర విభాగంలో క్రీడా పోటీలను ఎస్.కె.పి.జి.ఎన్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. వీరరాఘవరెడ్డి, విభాగపు క్రీడా సమన్వయకర్త ఎ. శ్రీనివాస్, క్రీడా అధికారి లక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శి ఎ.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు పందెం, ఈటె విసరడం విభాగాల్లో శివల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పేర్ల జగదీష్, పదవ తరగతి విద్యార్థి కట్ట వంశీ మొదటి స్థానం సాధించి అమరావతి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి. కృపలాల్, జిల్లా క్రీడా అధికారి జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం, నీటి సంఘం అధ్యక్షుడు ఎన్. సుబ్రహ్మణ్యం, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యురాలు వి. నాగమణి, శివప్రసాద్, సంతు కుమార్, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు ఇల్ల లక్ష్మి, ఉపాధ్యక్షుడు పి. రమేష్, కమిటీ సభ్యులు, శివల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, ప్రజలు, శివల వ్యాయామ ఉపాధ్యాయుడు జె. సురేష్ కుమార్ తదితరులు అభినందించారు.

## చెయ్యేరు- నంగవరం రోడ్డుకు మోక్షం లేదా?



**ఉప్పలగుప్తం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాట్రేనికోన మండల పరిధిలోని చెయ్యేరు ఉప్పలగుప్తం మండలం పరిధిలోని నంగవరం వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి గోతులమయంగా మారింది. కాట్రేనికోన మండలానికి చెందిన పలువురు ఈ రహదారి గుండా ఉప్పలగుప్తం, అమలాపురం తదితర ప్రాంతాలకు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. వీరంతా ఈ రోడ్డుపై ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మట్టి ట్రాక్టర్లు విపరీతంగా ఈ రోడ్డుపై ప్రయాణించడం వల్ల రోడ్డు పాడైందని స్థానికులు పేర్కొంటున్నారు.




### ప్రభుత్వ కార్యాలయాల్లో

# ప్రాథమిక హక్కులకే 'గ్రహణం'!

- అటకెక్కిన సమాచార హక్కు చట్టం బోర్డులు
- రౌతులపూడి అధికారుల తీవ్ర నిర్లక్ష్యం
- పేర్లు, ఫోన్ నంబర్లు లేక అయోమయంలో ప్రజలు




**కాకినాడ/రౌతులపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన చారిత్రాత్మక లిసమాచార హక్కు చట్టం (ఆర్టీఐ - 2005) ప్రభుత్వ కార్యాలయాల్లో అమలుకు నోచుకోకుండా నామ్‌కే వాస్తేగా మారుతోంది. ప్రజా ప్రయోజనాల కోసం రూపొందించిన ఈ చట్టాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా నిర్వహించడంలో అధికారులు తీవ్ర ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. కాకినాడ జిల్లా లిరౌతులపూడి మండల తహశీల్దార్ కార్యాలయంలోలి వెలుగు చూసిన నగ్న సత్యం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. అక్కడి తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఆర్టీఐ బోర్డును పెయింట్ చేయించినప్పటికీ, అందులో ఉండాల్సిన పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పి ఐ ఓ), అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఏపీఐఓ), అప్పిలేట్ అథారిటీ అధికారుల లిపేర్లు, హోదాలు, సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు పూర్తిగా ఖాళీగాలి వదిలేశారు. సమస్య కేవలం రౌతులపూడికే పరిమితం కాలేదు. కాకినాడ జిల్లా మొదలుకొని దాదాపు పలు మండల, డివిజన్, జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాల్లో ఇదే తరహా నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

**చట్టం ఏం చెప్తోంది? క్షేత్రస్థాయిలో జరుగుతున్నదేంటి?**

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం-ప్రతి ప్రభుత్వ కార్యాలయం వెలుపల ప్రజలకు స్పష్టంగా కనిపించేలా:

పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి పేరు & ఫోన్ నంబర్,
అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారి వివరాలు,
అప్పిలేట్ అథారిటీ (అప్పీలు అధికారి) నంబర్లు,
దరఖాస్తు రుసుము మరియు సమాచార సేకరణ వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి.

కానీ, క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం బోర్డులు వేయించి, అందులో ఏ వివరాలూ రాయకుండా చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల వివిధ గ్రామాల నుండి వివిధ పనుల నిమిత్తం, అర్జీల స్థితిగతులు తెలుసుకోవడానికి వచ్చే సామాన్య ప్రజలు ఏ అధికారిని కలవాలో తెలియక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**అధికారుల బదిలీలు సాకుగా చూపుతున్న సిబ్బంది**

పోస్టింగ్‌లు, బదిలీలు మారిన ప్రతిసారీ బోర్డులపై వివరాలు అప్‌డేట్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫోన్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వస్తోంది. ఉద్దేశపూర్వకంగానే వివరాలు దాచిపెడుతున్నారా అన్న అనుమానాలు పౌర సమాజం నుంచి వ్యక్తమవుతున్నాయి.

**జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి!**

రౌతులపూడి వంటి ప్రాంతాల్లో మాత్రమే కాక, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని తహశీల్దార్, ఎంపీడీఓ, మునిసిపల్, పోలీస్ మరియు ఇతర ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఆర్టీఐ బోర్డుల పరిస్థితిపై ప్రత్యేక సర్వే నిర్వహించాలి.

**ప్రజా సంఘాలు, హక్కుల పోరాటకర్తల ప్రధాన డిమాండ్లు**

1. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో లిఅధికారుల పేర్లు, అధికారిక ఫోన్ నంబర్లతో కూడిన సమాచార హక్కు బోర్డులనులి తక్షణమే పునరుద్ధరించాలి.
2. బోర్డుల్లో ఖాళీలు వదిలేసిన, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు లిషోకాజ్ నోటీసులులి జారీ చేయాలి.
3. బదిలీలు జరిగిన 24 గంటల్లోనే కొత్త అధికారుల వివరాలను బోర్డులపై నమోదు చేసేలా స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలి.

ఇప్పటికైనా కాకినాడ జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# 30 మంది నూతన ఫారెస్ట్ బీట్ అధికారులకు శిక్షణ పూర్తి

### అటవీ పరిరక్షణలో క్షేత్రస్థాయి అధికారులు కీలకం : వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ అకాడమీలో 14వ బ్యాచ్ ఫారెస్ట్ బీట్ అధికారుల శిక్షణార్థుల పాసింగ్ అవుట్ పరేడ్, స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరు నెలల కఠోర శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న 30 మంది నూతన ఫారెస్ట్ బీట్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, వెంకటరామన్నగూడెం ఉపకులపతి డాక్టర్ ధనుంజయరావు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులను అభినందిస్తూ, క్రమశిక్షణతో కూడిన సమర్థవంతమైన క్షేత్రస్థాయి అధికారులను తీర్చిదిద్దుతున్న అటవీ అకాడమీని ప్రశంసించారు. అటవీ పరిరక్షణకు ఫారెస్ట్ బీట్ అధికారి వెన్నెముక లాంటివారని ధనుంజయరావు అన్నారు. దేశ ప్రకృతి సంపదకు ముందుండే సైనికులుగా వారు పనిచేస్తారని తెలిపారు. అటవీ మంటలకు తొలి స్పందనదారులుగా, అక్రమ కలప రవాణా, వేటను అడ్డుకునే ప్రధాన సిబ్బందిగా, అటవీ ప్రాంత ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా బీట్ అధికారులు వ్యవహరిస్తారని చెప్పారు. ప్రతి చెట్టు, ప్రతి ఎకరం అటవీ భూమి, ప్రతి వన్యప్రాణి రక్షణ బాధ్యత క్షేత్రస్థాయిలో బీట్ అధికారులపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం, అటవీ శాఖలు పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో పరస్పరం అనుసంధానమైన కీలక రంగాలని తెలిపారు. అటవీ పర్యావరణ వ్యవస్థలు భూగర్భ జలమట్టాలను, ఉద్యానవన ఉత్పత్తికి అవసరమైన సూక్ష్మ వాతావరణాన్ని పరిరక్షిస్తాయని అన్నారు. వృక్ష జీవశాస్త్రం, సహజ పునరుత్పత్తి, వాతావరణానికి అనుకూలమైన జాతుల ఎంపికపై శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలని యువ అధికారులకు సూచించారు. ఆధునిక అటవీ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని తెలిపారు. జీపీఎస్ మ్యాపింగ్, జీఐఎస్ పరికరాలు, డ్రోన్ నిఘా, ఆధునిక నివేదికల యాప్‌లపై శిక్షణ పొందిన అధికారులు వాటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. అటవీ ఆక్రమణల పర్యవేక్షణ, అటవీ మంటల ముందస్తు హెచ్చరికలు, క్షేత్రస్థాయి వివరాల నమోదు కోసం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. ప్రజా విశ్వాసానికి సంరక్షకులుగా నిజాయితీతో పనిచేయడం, స్థానిక ప్రజలు, గిరిజన సంఘాలు, వన సంరక్షణ సమితులతో భాగస్వామ్యం పెంపొందించడం, నిరంతర శారీరక దారుఢ్యం, జీవితకాల అభ్యాసం పాటించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించడంతో పాటు ప్రకృతి, వన్యప్రాణులు, గ్రామీణ ప్రజల పట్ల కరుణతో వ్యవహరించడం వృత్తి జీవితానికి మార్గదర్శక సూత్రాలని ఆయన సూచించారు. అకాడమీ డైరెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అనంతరం తాత్కాలిక భవనాల్లో పనిచేస్తున్నప్పటికీ, 2017 నుంచి ఇప్పటి వరకు 878 మంది అటవీ ముందు వరుస సిబ్బందికి సిద్ధాంత, ఆచరణాత్మక, అధ్యయన పర్యటనల ఆధారిత శిక్షణ అందించినట్లు తెలిపారు. అకాడమీలో, నాగార్జునసాగర్-శ్రీశైలం పులుల అభయారణ్యంలో సీనియర్ అధికారులకు శిక్షణ, సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. వచ్చే నెలలో ట్రాఫిక్ ఇండియా, ప్రపంచ ప్రకృతి సంరక్షణ సంస్థ సహకారంతో మూడు రోజుల జాతీయ న్యాయ అమలు శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణ, పరిశోధన సహకారాన్ని బలోపేతం చేసేందుకు పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అవగాహన ఒప్పందాలు ఖరారు దశలో ఉన్నాయని చెప్పారు. జాతీయ ప్రమాణాలు, ఉన్నతి కార్యక్రమాల కింద అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. అత్యాధునిక తరగతి గదులు, సమావేశ మందిరంతో కూడిన నూతన అకాడమీ భవనం 2027 మార్చి నాటికి పూర్తవుతుందని వెల్లడించారు. 2027-28 విద్యా సంవత్సరం నుంచి అటవీ విద్యా సంచాలకత్వం పరిధిలో ఫారెస్ట్ రేంజ్ అధికారి శిక్షణలు ఇక్కడ ప్రారంభమవుతాయని తెలిపారు. వన్యప్రాణి సంరక్షణ సంస్థలు, ప్రకృతి అధ్యయన సంస్థలు, రిటైర్డ్ అటవీ అధికారులు అందిస్తున్న సాంకేతిక సహకారంతో అకాడమీ శిక్షణ మరింత బలోపేతమవుతోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధికారుల నుంచి క్షేత్రస్థాయి అభిప్రాయాలను సేకరించి పాఠ్యాంశాలను నిరంతరం మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. పరిశోధన, పర్యావరణ అధ్యయనాలు, సలహా సేవల నిర్వహణ కోసం ఏపీ ఫారెస్ట్ పరిశోధన, పర్యావరణ అధ్యయనాలు, శిక్షణల సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అనంతరం 14వ బ్యాచ్‌కు చెందిన నూతన అటవీ బీట్ అధికారులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, అకాడమీ అధ్యాపక బృందం, ప్రముఖులు, శిక్షణార్థుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### పొలం దారి ఆక్రమణపై

# పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం చినకొండెపూడికి చెందిన రైతులు సుమారు 56 సెంట్లు భూమి ఆక్ర మణకు గురైందంటూ పిజిఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సోమవారం రైతులు తాశిల్దార్ ను కలసి పత్రాలు సమర్పించారు. రైతులుమాట్లాడుతూ,చినకొండపూడి గ్రామంలో సర్వే నెంబరు 169/ 3 లో 70 సెంట్లు భూమి చిరువూరి మదుసూదనరావుకు చెందినది, ఇందులో 14 సెంట్లు చిరవూరి మధుసూదన్ రావు వ్యక్తి గత అవసరాల నిమిత్తం ఆకులకొండ య్యకు విక్రయించాడని చెప్పారు. మిగిలిన 56 సెంట్లు చినకొండెపూడి, రాపాక ,నాగంపల్లి రైతుల 900 ఎకరాలకు చుట్టుపక్కల రైతులైన మేడిశెట్టి వరలక్ష్మి, అడపా దుర్గా భవాని, కోలా బేబీ, గారపాటి లావణ్య, రావూరి త్రిమూర్తులు,మాగంటి రాంబాబు,మంద్రు జానకి దేవి తది తరులు దారి కొంత పొలాన్ని ఇచ్చా రన్నారు. అలాగేరైతుల అవసరాల దృష్ట్యా మదుసూదనరావు 56 సెంట్లు భూమిని రైతులకు దారిగా ఇచ్చారని తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన అల్లూరి రామ కృష్ణ అనే వ్యక్తిమదుసూదనరావుకు తెలియకుండా56 సెంట్లుకు తప్పు డు నకిలీ ధృవపత్రాలు సృష్టించి మొరకొండ వెంకటలక్ష్మికి అమ్మేశా డని తక్షణమే సర్వే చేసి ఆక్రమణ కు గురిఅయిన పొలందారిని మూ డు గ్రామాల రైతులకు ఇవ్వాలని కోరుతున్నామని తెలిపారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ మరియు రెవెన్యూ డివిజినల్ ఆఫీసర్ కూడా రైతులకు మద్దతు తెలిపారని రైతు లు గుర్తు చేసారు.

# పొలమూరులో బీజేపీ సంస్థాగత సమావేశం

### పార్టీ బలోపేతమే లక్ష్యం : ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం పొలమూరు గ్రామంలో భారతీయ జనతా పార్టీ అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ సంస్థాగత సమావేశం ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సమావేశానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. గ్రామస్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా బీజేపీ ఇన్చార్జ్ బుద్దా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎంఎస్కే రాజు (బీఎల్‌ఏ-1), రజని పాల్గొన్నారు. పార్టీ విస్తరణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత నిర్మాణం, బూత్ కమిటీల బలోపేతం, ప్రజల్లో పార్టీ సిద్ధాంతాలను మరింత విస్తృతంగా తీసుకెళ్లే కార్యాచరణతో పాటు పలు కీలక అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండి సేవలు అందించాలని నాయకులు సూచించారు. రానున్న కార్యక్రమాలను విజయవంతం చేయడానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ పరిశీలకులు, పలు మండలాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### అభివృద్ధి వేగవంతం పనుల నిమిత్తం

# అధికారులకు ఫిర్యాదు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో దళిత నాయకుడు డోకుబుర్ర భద్రం జిల్లా కలెక్టర్ మరియు కమిషనర్ కి వినతి పత్రాల రూపంలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో కాకినాడ నగర సుందరీకరణ కోసం రూ. 1 కోటి 30 లక్షల ఎస్టిమేషన్ ప్రభుత్వానికి పంపడం జరిగిందని ఈ ప్రతిపాదనను త్వరగా గ్రాంట్ అయ్యేలా చూడాలని కలెక్టర్‌ని కోరారు. అన్నమ్మ చెరువు అభివృద్ధి జగన్నాధపురం ఘాటీ సెంటర్ వద్ద గల "అన్నమ్మ చెరువు" అభివృద్ధి పనులకు రూ. 9,50,000/- టెండర్ శ్రీ వినాయక ఇంట్రాక్ట్రక్చర్ కంపెనీకి ఆమోదం అయింది. అభివృద్ధి పనులను త్వరగతిన ప్రారంభించాలని కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. కాకినాడనగర అభివృద్ధి మరియు చెరువుల పరిరక్షణ కోసం ఈ రెండు పనులు అత్యవసరం అని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఫిర్యాదులపై అధికారులు సానుకూలంగా స్పందించి పనులను త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి

# ప్రజల నుండి ఘన స్వాగతం

### నేమంలో శివాలయంలో ప్రత్యేక పూజలతో ప్రారంభించిన "పిల్లి" దంపతులు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమానికి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో సోమవారం ఘనంగా శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.టీడీపీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో నేమం గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నేమం గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ఆరంభించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లా బత్తుల అప్పారావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకంగా సూపర్-6 హామీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు విద్యా ప్రోత్సాహం, సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పెట్టుబడుల ఆకర్షణ, పరిశ్రమల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం 45 రోజులు పాటు జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కర్రీ వెంకట్రాజు, క్లస్టర్ లు సరిదే నాగ హరినాథ్, పేరాబత్తుల లోవబాబు,ప్రకాష్, నేమం గ్రామ పార్టీ అధ్యక్షులు గుబ్బల శివ, వాసంశెట్టి లోవరాజు, సీనియర్ నాయకులు మాసుమెను గంగయ్య, కాళ్ళ శ్రీనివాస్, కొమరిశెట్టి నరసింగరావు,వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్ టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మాతా లక్ష్మణ్



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మాత లక్ష్మణ్ నియమితులయ్యారు. కాకినాడ రూరల్ మండలం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సేవలందించిన లక్ష్మణ్ ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి జెండా మోసి కార్యకర్తగా పనిచేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తికి విధేయతడిగా పనిచేశారు. అలాగే మాతా పద్మ లక్ష్మణ్ సతీమణి మాతా లక్ష్మణ్ ఎంపిటిసిగా గ్రామంలోని సేవలు అందించారు. ఈ సందర్భంగా మాతా లక్ష్మణ్ మాట్లాడుతూ దళితులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించే దిశగా ముందుకు వెళ్తానని నాకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే, టీడీపీ కాకినాడ రూరల్ నియోజవర్గ ఇన్చార్జ్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి లకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు అలాగే నాకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమంపై ఇంటింటా తెలుగుదేశం



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు రూరల్ మండలం రావిమెట్ల గ్రామంలో 'రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి, సంక్షేమం.. ఇంటింటా తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు ఆదేశాల మేరకు, నిడదవోలు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెలగన సూర్యారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రతి కుటుంబానికి అందజేశారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వివరించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకులు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని నాయకులు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శంకరాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు పోల్నాటి లీలా భాస్కర్, రావిమెట్ల గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరమల్ల పెద్ది రాజు, పార్లమెంట్ కమిటీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి తాతపూడి బాలస్వామి, యూనిట్ ఇన్‌చార్జి మదు గంగాధర్, బూత్ ఇన్‌చార్జి మారిశెట్టి సురేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కామిని భాస్కరరావు పుట్టినరోజు వేడుకలు

### గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటి వృద్ధాశ్రమములో భోజనాలు ఏర్పాటు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రి బొమ్మూరుకు చెందిన ప్రముఖ రాజకీయ వేత్త కామిని భాస్కరరావు పుట్టినరోజు సందర్భంగా రాజమండ్రి బొమ్మూరు ప్రాంతమునకు చెందిన టిడిపి యువ నాయకులు మరియు జనసేన యువ నాయకులు పలువురు కలిసి రాజమండ్రి బొమ్మూరు ధవళేశ్వరం హార్లిక్స్ ఫ్యాక్టరీ ఎదురుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రక్కన అలియన్స్ నగర్ వుంటున్న గుడ్ కేర్ వృద్ధాశ్రమంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కామిని భాస్కరరావు, టిడిపి మండల అధ్యక్షులు భీమనశెట్టి రమేష్, టిడిపి నాయకులు గోపి, జనసేన నాయకులు సునీల్, ఎం.ఆర్.పి.ఎస్ నాయకులు యార్లగడ్డ సతీష్, వంశీ, రవి, పండు, సురేష్, సిద్దు, బషీర్ తదితరులు, గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటి వృద్ధాశ్రమము అధ్యక్షులు కావూరి వరలక్ష్మి, లీగల్ అడ్వైజర్ అడ్వకేట్ కావూరి సురేష్ కుమార్, సిబ్బంది నిషా తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి వందనం పథకం ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు వర్తింపు

### ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావుకు కృతజ్ఞతలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తల్లికి వందనం పథకాన్ని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా వర్తింపజేసి, ఆ మొత్తాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేయడంపై మండపేట జోనల్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ మేరకు సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావు ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రైవేట్ స్కూల్లో చదివే వేలాది మంది విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గిందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జోనల్ ప్రెసిడెంట్ ఎమ్మెస్ రావు, జోనల్ సెక్రెటరీ దత్తాత్రేయులు, జోనల్ ట్రెజరర్ ఎం చైతన్య, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ గుండు తాతరాజు, ఎంపీ ఎస్ స్కూల్ అధినేత వల్లూరీ చిన్నారావు, అక్షర స్కూల్ కరస్పాండెంట్ వంక సాయి రాంబాబు, విద్యా వికాస్ అధినేత వర్రే సత్యనారాయణ, విజ్ఞాన్ స్కూల్ దుర్గాప్రసాద్, సిద్ధార్థ శ్రీనివాస్, జె రాజేశ్వరరావు, బొప్పన వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల ఆశీర్వాదమే కూటమి పాలనకు బలం

### రెండేళ్ల పాలనలోనమ్మకం.. అభివృద్ధి... సంక్షేమం - అదే మా నినాదం : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్
### 1వ డివిజన్ నుంచి డోర్ టూ డోర్ కార్యక్రమానికి శ్రీకారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా అధిష్టానం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సోమవారం నుంచి డోర్ టూ డోర్ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్. 1వ డివిజన్లో బత్తిన నగర్ ప్రాంతంలో డివిజన్ ఇంచార్జ్ కడలి రామకృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని కూటమి నాయకులు గన్ని కృష్ణ, యర్రా వేణు గోపాల రాయుడు, మజ్జి రాంబాబు, వై శ్రీను, ఉప్పులూరి జానకి రామయ్య, కోసూరి చండిప్రియ, కప్పల వెలుగు కుమారి తదితరులతో కలిసి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వినతిపత్రాలను స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రెండేళ్లలో రాష్ట్రాన్ని "విధ్వంసం నుంచి వికాసం వైపు... సంక్షోభం నుంచి స్వర్ణాంధ్ర వైపు" నడిపిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా దెబ్బతిని, భారీ అప్పులతో రాష్ట్రం సంక్షోభంలో పడిందని, ప్రజలే ఆ ప్రభుత్వాన్ని తిరస్కరించి కూటమికి అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ప్రతి రంగంలోనూ ప్రజలకు ఉపయోగపడే విధంగా పరిపాలన సాగుతోందన్నారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, పోలవరం, నదుల అనుసంధానం, గుడ్ గవర్నెన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని తెలిపారు. అమరావతే ఏకైక రాజధానిగా రాష్ట్ర ప్రజలు గర్వంగా చెప్పుకునే పరిస్థితిని కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. తల్లికి వందనం పథకంలో గత ప్రభుత్వంలా ఒక్కరికి మాత్రమే కాకుండా కుటుంబంలో ఉన్న ప్రతి అర్హత కలిగిన విద్యార్థికి ప్రయోజనం కల్పించామని చెప్పారు. గతంలో వ్యక్తుల పేర్లతో నడిచిన పథకాలకు బదులుగా సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటి మహనీయుల పేర్లను ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి పేదలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ఆగస్టు నెలలో అర్హులైన అందరికీ కొత్త ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం సిటీలో 30 వేల మందికి పెన్షన్లు అందుతున్నాయని, అదనంగా మరో 3 వేల మంది అర్హులను గుర్తించి పెన్షన్లు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వకపోగా, ఉన్నవాటినే తొలగించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజమహేంద్రవరం సిటీలోనే 9 వేల కొత్త రైస్ కార్డులు జారీ చేశామని తెలిపారు. రైస్ కార్డే ప్రతి సంక్షేమ పథకానికి అర్హత కల్పించే ప్రధాన పత్రం కావడంతో అర్హులందరికీ అందిస్తున్నామని స్పష్టం చేశారు. సిటీలో రెండేళ్లలో బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకుల సహకారంతో రూ.300 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రూ.14 కోట్లతో మల్టీ పర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు ప్రారంభమయ్యాయని, మరో రూ.28 కోట్ల పనులకు టెండర్లు పూర్తయ్యాయని, రూ.100 కోట్లతో అఖండ గోదావరి, రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అమృత్--2.0 పథకం కింద రూ.95 కోట్లతో క్వారీ ప్రాంతంలోని 50 వేల మందికి దశాబ్దాలుగా ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నామని, మిగిలిన హామీలను కూడా దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. చెత్త పన్నును రద్దు చేశామని, నాణ్యత లేని మద్యం, నాసిరకం మద్యం, లిక్కర్ కుంభకోణాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం నాణ్యమైన వైద్య సేవలు, మందులు ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. రాజమహేంద్రవరం సిటీలో సుమారు రూ.8 కోట్ల సీఎస్ఆర్ నిధులు తీసుకొచ్చి విద్య, వైద్య రంగాల అభివృద్ధికి వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగి ఈ ఏడాది సుమారు 800 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్లలో రోజువారీ ఓపీ గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వ ఆస్పత్రిలో రోజుకు 400 మంది ఓపీ నుంచి ప్రస్తుతం 2 వేల మందికి పైగా చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం ద్వారా ఇప్పటికే 28 వార్డుల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నామని, ప్రధానంగా గృహ నిర్మాణం, పెన్షన్లు, మౌలిక వసతుల సమస్యలు ప్రజలు ప్రస్తావించారని తెలిపారు. పల్లకడియం--కానవరం ప్రాంతంలోని 11 వేల మంది లబ్ధిదారులకు త్వరలో ఇంటి స్థలాలు కేటాయిస్తామని, బూరిపూడి భూముల సమస్యకు ప్రత్యామ్నాయ పరిష్కారం చూపుతామని చెప్పారు. నగరంలో రూ.300 కోట్లతో రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేస్తున్నామని, పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని రూ.140 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరిస్తున్నామని తెలిపారు. నగరంలో ఇప్పటికే 150 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో ఐదు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి భూములు కేటాయించి టెండర్లు పూర్తి చేశామని వెల్లడించారు. డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని సుమారు 89 వేల ఇళ్లను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, అలాగే రాజమహేంద్రవరం సిటీలో అమలు చేసిన అభివృద్ధి పనులు, సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన కార్యక్రమాల వివరాలను ప్రజలకు కరపత్రాల ద్వారా తెలియజేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ప్రజలు గతంలో భయపడుతూ తమ సమస్యలు చెప్పుకోలేకపోయారని, ఇప్పుడు స్వేచ్ఛగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలు అడిగే ప్రతి ప్రశ్నకు బాధ్యతతో సమాధానం చెబుతూ సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని పేర్కొన్నారు. డోర్ టూ డోర్ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ ఇచ్చిన పిలుపు అయినప్పటికీ, కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు కలిసి ప్రజల్లోకి వెళ్లాలని అధిష్టానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. అందుకే మూడు పార్టీల నాయకులు కలిసికట్టుగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చేరువవుతూ కూటమి ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

## ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష కార్యదర్శులు మోతా బాల విజయ సారథి, గంద్రోతు వేణుగోపాల స్వామి (గోపి)ల పాటు పాలకవర్గ సభ్యులు.. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఆదివారం రాజమహేంద్రవరం నగరంలో గల ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం.. మంత్రికి పుష్పగుచ్ఛం అందించి ఎన్నికల నిర్వహణకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రి దుర్గేష్ కూడా నూతన పాలకవర్గాన్ని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం.. క్లబ్ కార్యకలాపాలు, జర్నలిస్టుల సంక్షేమం, మీడియా వృత్తి అభివృద్ధి, ప్రెస్ క్లబ్ అభివృద్ధి వంటి అంశాలపై మంత్రితో చర్చించారు. ప్రెస్ క్లబ్‌కు సంబంధించిన పలు సమస్యలు, అవసరాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, వాటిని పరిశీలించి సాధ్యమైన మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు సమాజానికి సమాచారాన్ని చేరవేసే వారధులని, ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందించేందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే, మీడియా ప్రతినిధులు నిష్పాక్షికంగా, బాధ్యతాయుతంగా వార్తలను ప్రజలకు చేరవేయాలని సూచించారు. సభ్యులందరూ సమిష్టి కృషి తో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.. ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ కోశాధికారి పురుషోత్తం కుమార్, సంయుక్త కార్యదర్శులు కృపానందం, జి న్యూస్ ప్రసాద్, కొట్టే మధు, పాలపర్తి శ్రీనివాస్, గోపాలకృష్ణ, సత్యనారాయణ, ఆకుల ఈశ్వర్, చంటి లతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో ప్రజలు రైతులు విద్యార్థులు సుభిక్షంగా ఉండాలి : తోరాటి

### కాశీ యాత్ర పరిపూర్ణం సందర్భంగా భక్తులకు అన్న సమారాధన



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రజలు రైతులు విద్యార్థులు ఆయురారోగ్యాలతో ఉండాలని అందరికీ ఉపాధితో పాటు చేస్తున్న పని కలిసి రావాలని తోరాటి శ్రీనివాస్ అన్నారు. సోమవారం గాదరాడ గ్రామానికి చెందిన తోరాటి శ్రీనివాస్ గత పది సంవత్సరాల నుండి వరుసగా కాశీయాత్ర చేస్తున్నానని, ఈ ఏడాదితో 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రామేశ్వరం నుండి కాశి, కాశీ నుండి రామేశ్వరం జలాభిషేకంతో కాశి యాత్ర పరిపూర్ణం చేశానని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి సాంప్రదాయాల ప్రకారం పరిపూర్ణ కాశీయాత్ర చేయడం పూర్వజన్మ సుకృతం, శివాజ్ఞతో పాటు ప్రత్యక్షదైవలైన తల్లిదండ్రుల ఆశీస్సులతోనే పూర్తి చేశానని ఈ సందర్భంగా తల్లిదండ్రులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. రాష్ట్రంలోని ప్రజలు ఆయురారోగ్య సుఖ సంతోషాలతో ఉండాలని, రైతులకు వ్యవసాయం కలిసి రావాలని, యువతి యువకులకు ఉపాధి దొరకాలన్న ఉద్దేశంతో కాశీ అన్నపూర్ణ విశ్వనాథుడిని ప్రార్థించానన్నారు. సందర్భంగా కనుపూరు గ్రామంలో స్వయంభు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి వారికి మద్దూరి కుమారస్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించి, భక్తులకు త్రివేణి సంగమం, రామేశ్వరం కాశి జలాలను అందించారు. అనంతరం తోరాటి ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తోరాటి శ్రీనివాస్ జగదీశ్వరి దంపతులు, కుమారులు శివ, జ్ఞానేశ్వర్, ఆలయ కమిటీసభ్యులు కరణం సత్యనారాయణ, వెలిశెట్టి రాంబాబు, అన్నం దుర్గాప్రసాద్, చాగంటి గణేష్, కరణం నరసింహారావు, కర్రి కామేశ్వరరావు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

షర్మిలమ్మ త్వరగా

## కోలుకుని తిరిగి రావాలి

### వేణుగోపాలస్వామి ఆలయంలో కాంగ్రెస్ పూజలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిళారెడ్డి త్వరగా కోలుకుని మళ్లీ కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించేందుకు కొత్త ఉత్సాహంతో ముందుకు రావాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కోరారు. షర్మిళారెడ్డి ఉదర శస్త్ర చికిత్స చేయించుకుని ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో ఆమె సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక గోదావరి గట్టున ఉన్న క్షేత్రపాలక వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె త్వరగా కోలుకుని మళ్లీ దైనందిన జీవితంలోకి రావాలని ఆ వేణుగోపాస్వామిని వేడుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, రాజమండ్రి పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు బెజవాడ రంగారావు మాట్లాడుతూ షర్మిళారెడ్డి పిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కాంగ్రెస్ పార్టీకి నూతనోత్తేజం వచ్చిందన్నారు. ఆమె త్వరగా కోలుకుని మళ్లీ కాంగ్రెస్ రథసారధిగా పార్టీని బలోపేతం చేయడానికి పనిచేయాలని ఆకాంక్షించారు. ఆమెకు ఆ భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ఇవ్వాలని ప్రార్థించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో చాలా ఉత్సాహంగా ఉందని, త్వరలోనే షర్మిళారెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడి సూరిబాబు, కిశోర్‌కుమార్ జైన్, సాకా పుల్లారావు, బర్రే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మెగా యూత్ ఫోర్స్ ఆంధ్రప్రదేశ్

## రాష్ట్ర కో-కన్వీనర్‌గా విజ్జన శివ నియామకం



**రాజమహేంద్రవరం/హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా యూత్ ఫోర్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా విజ్జన శివ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో శనివారం నిర్వహించిన మెగా యూత్ ఫోర్స్ నియామక కార్యక్రమంలో మెగా ప్రిన్సెస్, ప్రముఖ నిర్మాత సుస్మిత కొణిదెల చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా విజ్జన శివ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన మెగా యూత్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు సుస్మిత కొణిదెలకు, జాతీయ కన్వీనర్ ఏడిద బాబికి, సంస్థ నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని, రాష్ట్రవ్యాప్తంగా అభిమానులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు అంకితభావంతో పనిచేస్తానని విజ్జన శివ పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ మెగా యూత్ ఫోర్స్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మెగా యూత్ ఫోర్స్ జాతీయ, రాష్ట్ర నాయకులు, అభిమానులు, పలువురు ప్రముఖులు పాల్గొని విజ్జన శివకు అభినందనలు తెలిపారు.

విజయ భారతి చెస్ట్ ఇన్స్టిట్యూట్ పల్స్ హాస్పిటల్‌లో

## విశేష హోమాలు, పూజలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక విజయభారతి చెస్ట్ ఇనిస్టూట్ పల్స్ హాస్పిటల్ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం ప్రముఖ వైద్యనిపుణులు హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. పల్స్ హాస్పిటల్, వైద్య నిపుణులు డాక్టర్ లక్ష్మణ్ కొల్లూరి దంపతులు, డాక్టర్ వంశీకృష్ణరాజు దంపతులు, డాక్టర్ సాజిత్ కిషన్ దంపతులు లక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు ఈ హోమాలు వేద విశేష పూజలు నిర్వహించారు.

మానవ హక్కుల పరిరక్షణ

## మహిళా సమస్యలు పరిష్కారమే ధ్యేయం

### హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్ పర్సన్‌గా కే.సూర్య కుమారి నియామకం
### హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్ పర్సన్, టీడీపీ ఎస్సీ సెల్ నాయకురాలు డాక్టర్ ఖండవల్లి లక్ష్మి వెల్లడి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవ హక్కుల పరిరక్షణ మహిళా సమస్యలు పరిష్కారమే ధ్యేయమని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర, తెలంగాణా చైర్ పర్సన్, తెలుగు దేశం పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఖండవల్లి లక్ష్మి అన్నారు. సోమవారం రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆంధ్ర తెలంగాణా చైర్ పర్సన్‌గా జాతీయ అధ్యక్షులు తనకు కొన్ని బాధ్యతలు అప్పగించారని తెలిపారు.ఆయన ఆదేశాల మేరకు కొన్ని సోషల్ వర్క్‌లు చేస్తున్నట్లు వివరించారు.మహిళలకు అన్యాయం జరిగితే వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చాలా పెద్ద సంస్థ అని అన్నారు.ఈ సంస్థ ను కొందరు తమ స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రైవేట్ సంస్థలు పెట్టు కొని దందా లు, సెటిల్మెంట్ లు చేస్తున్నట్టు మా దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ సంస్థను అడ్డుపెట్టుకొని సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. తమ సంస్థకు ప్రత్యేక లోగో ఉందని, ఆ లోగో ఉంటేనే తమ సంస్థ సభ్యులని వివరించారు. లోగోలేని వారు తమ సభ్యులు కారని పేర్కొన్నారు. హ్యూమన్ రైట్స్ సంఘాలపై పోలీసుల గట్టిగా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసుల సహకారంతో తమ సంస్థ సభ్యులకు ఐడెంటి కార్డులు ఇచ్చినట్లు తెలిపారు. తమ సంస్థ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతుల మీదుగా ప్రశంసలు పొందారని తెలిపారు. తమ సంస్థ ఏర్పాటు చేసి పది సంవత్సరాలు పూర్తి చేసుకుని 11 వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కాకినాడలో బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ భారీ బహిరంగ సభ కు రిటైర్డ్ న్యాయమూర్తులతో పాటు , రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు నారా లోకేష్ ను పిలిచేందుకు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మానవ హక్కులు మహిళా హక్కుల పై, బాల కార్మికుల హక్కులపై, అవగాహన సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. తమ సమస్త సభ్యులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కానీ ఎక్కడా ఏ విధమైన డొనేషన్లు డబ్బులు వసూళ్లు చేయడం జరగదని అన్నారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్ పర్సన్‌గా కే.సూర్య కుమారిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.వి. లక్ష్మి, బి.వెంకటలక్ష్మి ,సిహెచ్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## గోవధ, గోవుల అక్రమ రవాణా అరికట్టాలి

### గో రక్షకులపై అక్రమ కేసులు నమోదు కాకుండా చూడాలి - జిల్లా ఎస్పీకి 'జనతా వారధి' బృందం వినతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోవధ, గోవుల అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టి, చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని జిల్లాఎస్పీకి బిజెపి జనతా వారధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు తూర్పుగోదావరి జిల్లా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర. జనతా వారధి కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్. యానాపు ఏసు. స్వామి సూర్య కిరణ్. మీనాక్షి. శేషాద్రి రవిశంకర్. తదితరులు సోమవారం జిల్లా ఎస్పీని కల్సి వినతి పత్రం సమర్పించారు. బిజెపి జిల్లా కార్యాలయంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమానికి గోవధ, గోవుల అక్రమ రవాణాకు సంబంధించి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని వారు ప్రస్తావించారు. గోవధ, గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, సున్నిత ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని వారు కోరారు. గోవుల అక్రమ రవాణాకు సంబంధించిన ప్రతి ఫిర్యాదును అత్యవసరంగా స్వీకరించి వెంటనే స్పందించాలని, చట్టవిరుద్ధ రవాణా నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన కేసులు నమోదు చేయాలని కోరారు. పశువుల రవాణాకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర చట్టాలను అన్ని పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించాలని, గో రక్షణ పేరుతో హింస, చట్టవ్యతిరేక చర్యలు జరగకుండా చూడడంతో పాటు, చట్టబద్ధంగా సమాచారం ఇచ్చిన వారిపై అనవసరంగా కేసులు నమోదు చేయకుండా నిష్పాక్షిక విచారణ చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ప్రజా మద్దతుతో ఉద్యమకార్యాచరణ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు.




## చెప్పిన తేదీకే వస్తున్న

# రవితేజ 'ఇరుముడి'

మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'ఇరుముడి' షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ, మేకర్స్ రిలీజ్ డేట్‌ను అధికారికంగా స్పష్టం చేశారు. ముందుగా ప్రకటించినట్లు ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయబోతున్నట్లు తెలుపుతూ ఒక సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విడుదలకు ఇంకా 25 రోజులే ఉందంటూ విడుదల చేసిన ఈ పోస్టర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో రవితేజ, కూతురిగా నటిస్తున్న బేబీ నక్షత్రతో కలిసి పేకాట ఆడుతూ నవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నాడు. శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఎమోషన్స్, ఆకట్టుకునే కుటుంబ కథాంశంతో సెంటిమెంట్‌ను పంచబోతోందని స్పష్టమవుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, చార్ట్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి కట్టు' అయ్యప్ప భక్తి పాటతో భారీ అంచనాలు నెలకొనగా, రాబోయే రోజుల్లో వరుస అప్‌డేట్స్‌ను అందించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రూపొందుతున్న ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నాడు.







# 'మహేంద్రగిరి వారాహి'లో

## స్టార్ హీరో క్యామియో.. ఎవరై ఉంటారు..?

సుమంత్ హీరోగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి' రిలీజ్ డేట్‌ను మేకర్స్ లాక్ చేశారు. సంతోష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా నిర్మాత మధు ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. ఈ సినిమాలో ఒక ప్రముఖ స్టార్ హీరో 20 నిమిషాల నిడివితో కూడిన కీలకమైన పాత్రలో కనిపించనున్నట్లు తెలిపారు. ఆ హీరో ఎవరనేది ప్రస్తుతానికి రహస్యంగా ఉంచామని, త్వరలోనే రాబోయే ట్రైలర్‌లో ఆ క్యారెక్టర్‌ను రివీల్ చేయబోతున్నట్లు స్పష్టం చేశారు. దీంతో ఈ సినిమాలో క్యామియో ఇవ్వబోయే ఆ స్టార్ హీరో ఎవరా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో నెలకొంది. ఇక ఈ సినిమాలో ఐశ్వర్య రాజేష్, మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

# మనోజ్ 'డేవిడ్ రెడ్డి'

## సినిమాపై కొత్త అప్ డేట్ !




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ హీరోగా తెరకెక్కుతున్న పీరియాడికల్ యాక్షన్ మూవీ 'డేవిడ్ రెడ్డి'. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా పై లేటెస్ట్ అప్ డేట్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా కోసం క్లైమాక్స్ కోసం టీమ్ సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఓ సెట్ కూడా వేస్తున్నారు. మనోజ్ కూడా తన కొత్త లుక్ కోసం కసరత్తులు చేశాడు. అలాగే ఈ క్లైమాక్స్ కోసం మనోజ్ భారీ యాక్షన్ సీన్స్ ను కూడా షూట్ చేయనున్నారు. మరోవైపు టీమ్ ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉంది. ఇక 'డేవిడ్ రెడ్డి' కథ విషయానికొస్తే.. స్వాతంత్రానికి పూర్వం జరిగిన కథ ఇది. బ్రిటిష్ వారిపై పోరాడిన 'డేవిడ్ రెడ్డి' అనే యోధుడి కథగా రానున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కోసం 'వార్ డాగ్' అనే బైక్‌ను రూపొందించారు. దాని బరువు దాదాపు 700 కేజీలు. సినిమాలో అది ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. అన్నట్టు ఈ సినిమాలో మనోజ్ సరసన 'ప్రిన్స్' (కోలీవుడ్ మూవీ) హీరోయిన్ మరియా నటించబోతుంది.

# జూనియర్ ఎన్టీఆర్‌కు గాయం.. అభిమానుల్లో ఆందోళన!



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ స్వల్ప గాయానికి గురయ్యాడు. ఈ సాయంత్రం ఆయన భుజానికి తీవ్ర గాయమైనట్లు అధికారికంగా వెల్లడించారు. వెంటనే ఆయనను పరీక్షించిన వైద్యుల బృందం డాక్టర్ జె. మధుసూదన్ రావు మరియు డాక్టర్ ఆర్.ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలో పూర్తి స్థాయిలో కోలుకోవడానికి 6 నుండి 8 వారాల పాటు కంప్లీట్ రెస్ట్ తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనతో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కంగారు పడాల్సిన పని ఏమాత్రం లేదని ఎన్టీఆర్ టీమ్ అధికారిక ప్రకటనలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ ఆరోగ్యం క్షేమంగానే ఉందని, రికవరీ సరైన క్రమంలో సాగుతుందని హామీ ఇచ్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితి మరియు రికవరీ కి సంబంధించిన మరిన్ని వివరాలు ఎప్పటికప్పుడు అధికారికంగా వెల్లడిస్తామని ఎన్టీఆర్ టీమ్ తెలిపింది. అభిమానులు మరియు సినీ వర్గాలు ఆయన త్వరగా కోలుకోవాలని కామెంట్లు చేస్తున్నారు.




# ఐఎస్‌ఎస్‌ఎఫ్ వరల్డ్ కప్.. ఇషా సింగ్‌కు స్వర్ణం




హాంగ్‌ఝౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సత్తాచాటింది. మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో ఒలింపిక్ పతక విజేత మనూ బాకర్‌ను ఓడించి ఇషా సింగ్ స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్‌లో ఈ హైదరాబాదీ షూటర్ నిలకడ ప్రదర్శించి 40 హిట్స్‌తో బంగారు పతకాన్ని గెల్చుకుంది. కాంస్య పతకం కోసం మనూ బాకర్ పోరాడాల్సి వచ్చింది. షూట్ ఆఫ్‌ను దాటుకుని వచ్చిన మను.. 28 హిట్స్‌తో మూడో స్థానంలో నిలిచింది. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో భారత షూటర్లు అదరగొట్టారు. మనూ బాకర్ 586-20× స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా.. 21 ఏళ్ల ఇషా సింగ్.. 585-18× స్కోరుతో రెండో స్థానంలో నిలిచినప్పటికీ ఫైనల్‌లో మాత్రం అదిరిపోయే ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కొల్లగొట్టింది.

## కామన్వెల్త్ గేమ్స్.. వెయిట్‌లిఫ్టింగ్‌లో

# భారత్‌కు మరో పతకం




కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ మరో పతకం సాధించింది. మహిళల వెయిట్‌లిఫ్టింగ్ 53 కేజీల విభాగంలో జ్ఞానేశ్వరి యాదవ్ రజత పతకం దక్కించుకుంది. స్నాచ్‌లో 88 కేజీలు ఎత్తిన జ్ఞానేశ్వరి.. క్లీన్ అండ్ జెర్క్ 111 కేజీలు మోసి, మొత్తంగా 199 కేజీలతో రెండో స్థానంలో నిలిచింది. ఒనోమే ఒమోలోలా (నైజీరియా) స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. ఆమె మొత్తం 206 కిలోల (స్నాచ్‌లో 93, క్లీన్ అండ్ జర్క్ 113 కిలోలు) బరువును ఎత్తి కామన్వెల్త్ క్రీడల రికార్డును నెలకొల్పింది. కాగా, రెబెకా గ్రౌల్ఫ్ (కెనడా, 178 కేజీలు) కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ఫైనల్‌లో జ్ఞానేశ్వరి.. స్నాచ్, క్లీన్ అండ్ జర్క్ రెండింటిలోనూ ఒక్క ప్రయత్నం కూడా విఫలం కాకపోవడం విశేషం. ఛత్తీస్‌గఢ్‌లోని భోండియా గ్రామానికి చెందిన 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్ రాష్ట్ర పోలీస్ శాఖలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోంది. ఆమె తండ్రి ఒకప్పుడు బాడీబిల్డర్. కానీ ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన కలలను వదులుకున్నారు. ఆయన ఇప్పుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. జ్ఞానేశ్వరి పతకం సాధించడంతో ఈ కామన్వెల్త్ గేమ్స్‌లో వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. ఇప్పటికే మహిళల విభాగంలో మీరాబాయి చాను స్వర్ణం గెలవగా.. పురుషుల విభాగంలో రిషికాంత సింగ్, ముత్తుపాండి రాజా రజత పతకాలు సాధించారు. ఓవరాల్‌గా భారత్ ఇప్పటివరకు ఐదు పతకాలు సాధించింది.

# మొన్న జైస్వాల్, నిన్న అభిషేక్.. ఆ ఒక్కడి దెబ్బకు ఇలా బలయ్యారేంది..

టీమిండియా యువ ఆటగాళ్ల మధ్య పెరుగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ భారత జట్టును మరింత బలోపేతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, అభిషేక్ శర్మ తన తప్పులను దిద్దుకుని త్వరగా ఫామ్‌లోకి రాకపోతే జట్టులో కొనసాగడం కష్టతరంగా మారుతుంది. భారత క్రికెట్ జట్టులో ఇప్పుడు ఒకే ఒక్క పేరు మార్మోగుతోంది. పదిహేనేళ్ల వయసులో సంచలనాలు సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ ఎంట్రీతో మరో యువ సంచలనం అభిషేక్ శర్మ కెరీర్ ప్రమాదంలో పడింది. జింబాబ్వే టూర్‌లో వైభవ్ అదరగొడుతుండగా.. వరుస వైఫల్యాలతో అభిషేక్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాడు. చరిత్ర సృష్టిస్తున్న వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్‌లో తన అద్భుతమైన ప్రదర్శనతో టీమిండియాలోకి అడుగుపెట్టిన వైభవ్ సూర్యవంశీ ఇంగ్లాండ్ సిరీస్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. అయితే జింబాబ్వేతో జరిగిన తాజా సిరీస్‌లో మాత్రం ఈ టీనేజ్ సెన్సేషన్ రెచ్చిపోయాడు. ఆఖరి టీ20 మ్యాచ్‌లో కేవలం 49 బంతుల్లోనే ఎనిమిది ఫోర్లు నాలుగు సిక్సర్లతో ఏకంగా 81 పరుగులు బాదేశాడు. ఈ సిరీస్‌లో వైభవ్‌కి ఇది రెండో హాఫ్ సెంచరీ కావడం విశేషం. కేవలం పదిహేనేళ్ల వయసులో రెండు అంతర్జాతీయ అర్ధశతకాలు బాదిన రికార్డును తన పేరు మీద రాసుకున్నాడు.



ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ కైవసం చేసుకుని అంతర్జాతీయ క్రికెట్‌లో సంచలనంగా మారాడు. మైదానంలో అతడు చూపుతున్న దూకుడు చూసి దిగ్గజాలు సైతం అవాక్కవుతున్నారు.

**తీవ్ర నిరాశపరుస్తున్న అభిషేక్ శర్మ..**

మరోవైపు ఇదే సిరీస్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగుతున్న అభిషేక్ శర్మ పూర్తిగా నిరాశపరిచాడు. జింబాబ్వేతో జరిగిన మూడు టీ20 మ్యాచ్‌లలోనూ అతను కనీసం సింగిల్ డిజిట్ స్కోరును కూడా దాటలేకపోయాడు. మూడో మ్యాచ్‌లో బ్లెస్సింగ్ ముజరబాని బౌలింగ్‌లో కేవలం నాలుగు బంతులు ఎదుర్కొని పెవిలియన్ చేరాడు. ఈ సిరీస్‌లో అత్యంత తక్కువ పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా చెత్త రికార్డును మూటగట్టుకున్నాడు. మొదటి మ్యాచ్‌లో ఎనిమిది బంతులు ఆడి ఒక్క పరుగు మాత్రమే చేశాడు. రెండో మ్యాచ్‌లో రెండు ఫోర్లు బాది కాస్త కుదురుకున్నట్టే కనిపించినా అనవసరమైన షాట్ ఆడి వికెట్ పారేసుకున్నాడు. ఒకే బౌలర్ బౌలింగ్‌లో పదే పదే అవుట్ కావడం పట్ల అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భయపెడుతున్న వైభవ్ దూకుడు..**

తనకంటే చిన్నవాడైన వైభవ్ సూర్యవంశీ బౌలర్లను చెడుగుడు ఆడుతుంటే.. అభిషేక్ శర్మపై దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. తాను కూడా అంతే వేగంగా ఆడాలనే కసితో త్వరగా వికెట్లు ఇస్తున్నాడని విశ్లేషకులు భావిస్తున్నారు. వైభవ్ సూర్యవంశీ రూపంలో వచ్చిన ఈ గట్టి పోటీ అభిషేక్‌ను తీవ్రమైన మానసిక ఒత్తిడిలోకి నెట్టేసింది. జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ఇకపై భారీ ఇన్నింగ్స్‌లు ఆడక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఇదే వైఫల్యం కొనసాగితే తుది జట్టులో చోటు కోల్పోవాల్సి వస్తుందని క్రికెట్ పండితులు హెచ్చరిస్తున్నారు. సంజు శాంసన్ లాంటి సీనియర్లు బెంచ్‌పై వేచి చూస్తుండటంతో అభిషేక్ కెరీర్‌కు రాబోయే రోజులు అత్యంత కీలకం కానున్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com